అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
1
మంగళవారం 07 మార్చి 2023

ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నూతనకల్

జడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛమిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా సీనియర్ నాయకులు యాస ఎల్లారెడ్డి , పన్నాల సైదిరెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్కి బుచ్చయ్యగౌడ్, కాంగ్రెస్ మండల నాయకులు బత్తుల విజయ్‌కుమార్, తాడూరి లింగయ్య, రేసు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల సురేష్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా శ్రీ సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



మద్దిరాల: మండలంలోని రెడ్డిగూడెంలో సోమవారం శ్రీ సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లాఅధ్యక్షులు ఎస్ఏ రజాక్ , సర్పంచ్ బరపటిఉపేందర్, జెడ్పీటీసీ కన్నా సురంభ వీరన్నగౌడ్, వైస్ఎంపీపీ శ్రీరామ్‌రెడ్డి, ఎంపీటీసీ నాగెల్లి శ్రీలత శ్రావణ్ కుమార్, దుగ్యాల రవీందర్‌రావు, దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రేటినేని వెంకటయ్య అధ్యక్షుడు తాందారి ప్రతాప్‌గౌడ్ జన్నయ్య, దుగ్యాల రఘురాం, గోపి, బెడద వెంకన్న, చాపల సందీప్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్ అధ్యక్షతన జరిగిన పార్టీ నియోజకవర్గ, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. అచ్చే దిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ మాయ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేద మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. హిందూత్వ ఎజెండాను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి దేశంలో ముస్లిం, మైనార్టీలకు రక్షణ లేకుండా చేస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందని పేర్కొన్నారు. దేశం వెలిగిపోతుందని గొప్పలు చెబుతున్న మోడీ దేశ రాజ్యాంగాన్ని రక్షించడంలో విఫలమయ్యారన్నారు. పెట్టుబడి దారులకు, కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక, ప్రజాస్వామ్య విలువలను మంట గలుపుతూ, రాజ్యాంగాన్ని మార్చాలని మోడీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం కోసం లౌకిక, ప్రజాస్వామ్య, అభ్యుదయ, సామాజిక శక్తులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు ఎలుగురి గోవింద్, మేకనబోయిన సైదమ్మ, కొప్పుల రజిత, చినపంగి నర్సయ్య, వీరబోయిన రవి పెన్ పహాడ్, ఆత్మకూరు ఎస్ సీపీఎం మండల కార్యదర్శులు రణపంగ కృష్ణ, అవిరే అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డును పూడ్చిన నాయకులు



నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మండల పరిధిలోని పెంచికల్ దిన్న నుండి ఫత్తేపురం వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉన్న రోడ్డును దాతల సహాయంతో పూడ్చివేసిన పెంచికల్ దిన్న గ్రామ అఖిలపక్ష నాయకులు. ప్రయాణికులకు రైతులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నది. ఆ రోడ్డు ప్రమాదకరంగా ఉందని గతంలో ఆరోడ్డులో ధాన్యంతో ప్రయాణించే ట్రాక్టర్ బోల్తా పడి రైతుల ఇబ్బందులకు గురయ్యారు. అది గమనించిన సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆర్థిక సహకారంతో 60 ట్రిప్పుల మట్టి పోసి ఆ రోడ్డు గుంతలను పూడ్చివేయించారు. ఈ కార్యక్ర మంలో పెంచికల్‌దిన్న సర్పంచ్ సుంకరివాణి శ్రీరామ్మూర్తి, సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు నందమూరి బాబురావు, అల్వాల శ్రీధర్, జీడిమెట్లరవి, ఉపసర్పంచ్ ఎల్లబోయిన వెంకటి, పారుపల్లి శ్రీను వూట్కూరి సైదులు ,పెండెం హరిబాబు పోగుల సైదులు పెరుగు నాగరాజు, మరియు రైతులు రాచూరిసురేష్, ఎల్లబోయిన నాగరాజు, వలపని సత్యం, పెండెం రాంబాబు, పెండెం సైదులు రమాచనేని మురళి పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణి త్రివేణికి సన్మానం



నవతెలంగాణ-హుజూర్‌నగర్

గానుగు బండ గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారిణి త్రివేణి జాతీయ కమిటీ జట్టుకు ఎంపికైనందున సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. నేపాల్ దేశంలో అంతర్జాతీయ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఎంపికైన త్రివేణికి 25వేల ఆర్థిక సాయం అందించి ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలలో పాల్గొనే విధంగా సాధన చేయాలన్నారు.



కులమతాలకతీతంగా బీర్ల ఫౌండేషన్ సేవలు

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎం

ఆలేరు నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ బీర్ల ఐలయ్య కుల మతాలకతీతంగా బీర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడని బీర్ల ఫౌండేషన్ మండల కన్వీనర్ బత్తిని ఉప్పలయ్యగౌడ్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గం ప్రజల కష్టసుఖాలను చూసి చలించి నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చాలనే ఉద్దేశంతో బీర్ల ఫౌండేషన్ స్థాపించారన్నారు. తద్వారా ఆలేరు నియోజకవర్గ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాలలోని ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కోసం నియోజకవర్గంలోని ప్రతి మండలానికి కన్వీనర్లను ఏర్పాటు చేసుకొని ప్రజలకు నిరంతరం సేవలను అందిస్తుందన్నారన్నారు. నియోజకవర్గంలోని సుమారు120 పైగా గ్రామాలకు వాటర్‌ప్లాంట్లను, పేద ప్రజలకు వాటర్‌క్యాన్లను పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయంగా పనిచేస్తున్న బీర్ల ఐలయ్యను ప్రజలు ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకుని మృతి

నవతెలంగాణ-నేరేడుచర్ల

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఉప్పెల్లి. వెంకులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన ఆయన పార్టీ సీనియర్ సభ్యులు ఒకరు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్ ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పార్టీలో ఉంటూ చురుకైన పాత్ర పోషిస్తూ పేదల పక్షాన ఎర్రజెండా నీడన జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంకు తిరుపతయ్య, పెంచికల్‌దిన్న శాఖ కార్యదర్శి అల్వాల శ్రీధర్, రేపల్లి భిక్షం, జీడిమెట్ల ఎల్లమ్మ, బొప్పన రాణమ్మ, పాలకూరి రాములమ్మ, కందుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలపరిధిలోని వెలువర్తి గ్రామంలోని అంబేద్కర్ కాలనీ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం నూతన కమిటీని సోమవారం గౌరవాధ్యక్షులు కూచుమల్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూచుమల్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా కూచుమల్ల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా కూచుమల్ల నాగేష్, కోశాధికారి కూచుమల్ల భగవంతు, సహాయ కార్యదర్శిగా కూచుమల్ల రాజు, గణేష్, రాము, లింగస్వామి, నవీన్, నాగేందర్, సోమలింగం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, రామ్ చందర్, మల్లేష్, శ్రీనివాస్, శంకర్, సత్తయ్య, కిరణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్‌ఫ్రూట్ సాగు... భలే బాగు..!

- ఒకసారి నాటితే 30ఏళ్లు దిగుబడి
- ఎకరాకు రూ.15లక్షల ఆదాయం
- ఆధునిక పద్ధతుల్లో ఎన్ఆర్ఐ సేద్యం
- యూనివర్శిటీ నుంచి వ్యవసాయ బడికి
- ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు (శ్రీశ్రీ) ప్రస్థానం

నవతెలంగాణ-హుజూర్‌నగర్ రూరల్

భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయ రంగం ఎంత దన్నుగా ఉంటుందో అందరికీ తెలిసిందే. దేశానికి పట్టుగొమ్మ అయిన వ్యవసాయాన్ని ఇప్పుడు వస్తున్న ఆధునిక పద్ధతులను, అధునాతన పంటలను మేళవించి సేద్యం చేస్తూ ముందుకు వెళ్లకుంటే రైతు రాణించలేని పరిస్థితి నెలకొంది. సంప్రదాయ పంటలనే నమ్ముకుని వెళితే ఈరోజుల్లో రైతు గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి స్థితిలో వ్యవసాయం మీదున్న ఆసక్తితో ఓ ఎన్ఆర్ఐ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకుని అధునాతన పంటలను సేద్యం చేసేందుకు నడుంకట్టారు. ఆయనే సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు(శ్రీశ్రీ). సేంద్రియ పద్ధతుల్లో ఇప్పటికే మామిడిని సాగుచేస్తున్న తాను డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నడుంబిగించారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు వివరాలను ఆయన 'నవతెలంగాణ'తో పంచుకున్నారు.

కరోనా అనంతరం పరిస్థితుల్లో డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మంచి ఔషధ గుణాలు కలిగి ఉండటంతో చాలా మంది రైతులు దీనిని సాగుచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిని ఒకసారి నాటితే 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుంది. నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. సుమారు రూ.65లక్షల వరకు ఖర్చు వస్తుంది. దీనిని రెండు రకాలకుగా సాగు చేసుకోవచ్చు. ఒకటి రింగ్ సిస్టమ్, రెండు ట్రెల్లీస్ మెథడ్. రింగ్ సిస్టమ్‌లో ఎకరాకు 5లక్షల ఖర్చు వస్తుంది. దీనిలో ఎకరానికి 2వేల మొక్కలు పడతాయి. ట్రెల్లీస్ సిస్టమ్‌లో ఎకరాకు 5,500 మొక్కలు పడతాయి. దీనికి 16లక్షల ఖర్చు వస్తుంది.

నైపుణ్యం గల కార్మికులతో పోల్స్ నిర్మాణం

డ్రాగన్ ఫ్రూట్ సేద్యానికి ముఖ్యంగా పోల్స్ ఎంతో అవసరం. వీటిని మధ్యప్రదేశ్ నుండి నైపుణ్యం గల కార్మికులను రప్పించి 10 అడుగుల పోల్స్‌ను స్వయంగా తయారు చేయించాను. పోల్‌కు పోల్‌కు మధ్య 10 అడుగుల దూరం బోదెకు బోదెకు మధ్య ట్రాక్టర్ తిరిగేందుకు వీలుగా 16 అడుగుల స్థలం వదిలేశాను. రెండు పోల్స్ మధ్య ఇరువైపులా 16మొక్కలు నాటుకోవచ్చు. ట్రెల్లీస్ సిస్టమ్‌లో రెండు వైపులా జింక్ కోటెడ్‌రాడ్స్, ఇరువైపులా 4ఎం.ఎం. వైరు రెండు వరుసల చొప్పున ఉండటంతో మొక్క దీనిపై వేలాడుతుంది. దీనిలో 10 నుండి 15 వరుసల్లో డబుల్ లేయర్ సిస్టమ్ కూడా అమలు చేస్తున్నారు. 5.5 అడుగుల ఎత్తులో 16 నుండి 18 సెం.మీ. రాడ్డుతో సింగిల్ అండ్ డబుల్ లేయర్ సిస్టమ్‌ను ప్రయోగాత్మకంగా చేపట్టాను.

డ్రాగన్ ఫ్రూట్ రకాలు

డ్రాగన్ ఫ్రూట్ సాగులో మొక్కల రకాల ఎంపిక కీలకం. అందుకు గాను దేశవిదేశాల నుండి మొక్కలను దిగుమతి చేసుకున్నాను. కేరళ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో 150 క్షేత్ర పర్యటనల ద్వారా అధ్యయనం చేసి మంచి దిగుబడులు వచ్చే మొక్కల రకాలను ఎంపిక చేసుకున్నాను. తాను సేద్యం చేస్తున్న వాటిలో తైవాన్‌పింక్, సియాన్ రెడ్, మొరాకెల్ రెడ్, అమెరికన్ బ్యూటీ, ఆసిస్ వైట్, రాయల్‌రెడ్, ఇజ్రాయిల్ ఎల్లో రకాలు ఉన్నాయి. వీటిలో అరుదుగా లభించే వైట్, ఎల్లో రకాలు వియత్నాం, తైవాన్ నుండి దిగుమతి చేసుకున్నాము.

డ్రిప్ విధానంతో నీటి పొదుపు

డ్రాగన్ సాగుకు నీరు ఎక్కువగా అవసరం ఉండదు. తాను డ్రిప్ పద్ధతుల్లో మొక్కలకు నీటి సౌకర్యం కల్పిస్తున్నాను. నాణ్యతలో రాజీ పడకుండా జైన్ కంపెనీకి చెందిన డ్రిప్ పరికరాలను వాడాను. బోదెకు ఇరువైపులా కలిపి అరఅడుగు దూరానికి ఒక డ్రిప్ కవర్ అయ్యే విధంగా అమర్చాము. ట్రైకోడెర్మా సుడోమోనాస్, వ్యామ్, పాస్పరస్ సల్ఫర్ బ్యాక్టీరియా, జీవామృతం డ్రిప్ ద్వారా వారానికోసారి మొక్కలకు అందించాలి. వేసవిలో ఉష్ణోగ్రతల నుండి తట్టుకునేందుకు గాను స్ప్రింకర్ల ద్వారా 7.7 అడుగుల ఎత్తు నుండి నీటిని ఎదజల్లుతూ ఉష్ణాన్ని అదుపులో ఉంచవచ్చు. ఆవుపేడ, ఆవుమూత్రము, పప్పు ధాన్యాల పిండి పదార్థాలు, బెల్లంతో జీవామృతం తయారు చేసే యంత్రాన్ని పూనే నుండి తెప్పించాను.

మొక్క నాటే విధానం

పూర్తి ఆర్గానిక్ విధానంతో సాగు చేస్తున్న దీనికి పోల్‌కు పోల్‌కు మధ్య అడుగు బోదె పోయాలి. బోదెల్లో వర్మీకంపోస్టు, పశువుల ఎరువు, గొర్రెలు, కోళ్ల పెంట కలపాలి. వీటితో పాటు ట్రైకోడెర్మా, సుడోమోనాస్, అజోస్పోరిల్లం, పాస్పరస్ సల్ఫర్ బ్యాక్టీరియా కలిపి బోదెల్లో కప్పివేసి మొక్కలు నాటాలి. అనంతరం మొక్కలపై సాఫ్ పిచికారీ చేయాలి. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోదెలను సరిచేస్తూ ఉండాలి. మొదటి మూడు నెలల వరకు ప్రతి 3 రోజులకు ఒక సారి మందులను స్ప్రే చేయాలి. మొక్క నాటిన 15 రోజుల వరకు నిద్రావస్థలో ఉంటుంది. అనంతరం వేరుపోసుకుంటుంది. 8నెలల్లో కాపుకు వస్తుంది. పూత దశ నుండి కాయ తెంపే దశవరకు 45రోజుల సమయం పడుతుంది. సన్‌లైట్ వల్ల, ఓవర్ ఫీడింగ్ వల్ల ఎల్లో షేడ్ వస్తుంది. చీమల నివారణకు పాల్‌డాల్ పౌడర్ చల్లాలి. దోమల నివారణకు స్టికీ బ్యాగ్స్‌ను వాడాలి.

దిగుబడి.. మార్కెట్

ఎకరాకు కనీసం 10 టన్నుల దిగుబడి వస్తుంది. వీటిని స్థానిక వ్యాపారులతో పాటు హైదరాబాద్, ముంబాయి, పశ్చిమబెంగాల్ మార్కెట్‌కు ఎగుమతి చేయవచ్చు. కిలో ధర రూ.100పైగా ఉంటుంది. కాయలు కాసిన మొక్క భాగాన్ని తిరిగి నాటుకునేందుకు వీలుగా రైతులకు విక్రయించడం ద్వారా కూడా ఆదాయం అర్జించవచ్చు.

అంతర్ పంటలు

డ్రాగన్‌లో అంతర్ పంటల సాగు కూడా చేసుకోచ్చు. టమాటా, వేరుశనగ, పుచ్చ, దోస, ఆకుకూరలను సాగుచేసుకోవచ్చు. దీనిలో కలుపు ప్రధాన సమస్యగా ఉంటుంది. దీనిని ఎప్పటికప్పుడు తీసువేస్తూ ఉండాలి. కొత్తగా ఈ పంటను సాగు చేయాలనే ఆసక్తి ఉన్న వారికి ఎలాంటి సలహాలు సూచనలు కావాలన్నా తనను ఈ నెంబర్‌లో 9618300450 సంప్రదించవచ్చని డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు(శ్రీశ్రీ) తెలిపారు.



డాక్టర్ శ్రీనివాసరావు(శ్రీశ్రీ) సేవా కార్యక్రమాలు...

ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులకు డాక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు(శ్రీశ్రీ)గా సుపరిచితులు. 17సంవత్సరాలు సౌదీ అరేబియాలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచింగ్‌లో అంతర్జాతీయ పత్రికల్లో ఒక విద్యాసంవత్సరంలో 42 పరిశోధనా వ్యాసాలు ప్రచురించి ప్రపంచ రికార్డును సృష్టించి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించుకున్నారు. సౌదీ అరేబియాలో తెలుగు



కళాసమితి (టికేఎస్) ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఉంటూ 17ఏండ్ల పాటు అక్కడి తెలుగువారికి సేవా కార్యక్రమాలు చేస్తూ, కష్టాలలో ఉన్నప్పుడు ఆర్థిక సాయం కూడా చేశారు. విద్యా ప్రాధాన్యత తెలిసిన వారు కనుక తన స్వగ్రామంలోని పాఠశాల విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. పాఠశాలకు తన స్వంత ఖర్చులతో గేటు ఏర్పాటు చేశారు. వంట గదిని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తూ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తున్నారు. మదర్‌థెరిస్సా విగ్రహావిష్కరణకు తనవంతు సహాయం అందజేశారు. వృత్తి పరంగానే కాకుండా తన ప్రవృత్తి అయిన వ్యవసాయం పట్ల తనకున్న మక్కువతో ఆధునిక వ్యవసాయాన్ని సేద్యం చేసేందుకు ముందడుగు వేశారు.



అంధత్వ నివారణకే కంటి వెలుగు

- ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ప్రతి గ్రామంలో అందత్వ నివారణ కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో.సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాస్, సర్పంచ్ వలిగొండ కలమ్మ, జీడికల్ ఉపసర్పంచ్ బత్తిని రాంబాబు, బత్తిని రమేష్, శీను, లింగస్వామి, అనిల్, అమ్మ ప్రియాంక, రమేష్, పంచాయతీ కార్యదర్శి శారద, వైద్య అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

8 నుండి ఆరోగ్య మహిళ కార్యక్రమం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గంలోని 5 పీహెచ్సిలు, ఒక యూపీహెచ్సిలో ఈనెల 8 నుండి మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ. కొండలరావు సోమవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నియోజక వర్గంలో యూపీహెచ్సీ మాన్యంచెలక, మునుగోడు నియోజకవర్గంలో సిహెచ్సి మర్రిగూడ, నకిరేకల్ నియోజకవర్గంలో పిహెచ్సి కట్టంగూరు, మిర్యాలగూడ నియోజకవర్గంలో వేములపల్లి పిహెచ్సి, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పిహెచ్సి నిడమనూరు, దేవరకొండ నియోజకవర్గంలో పిహెచ్సి డిండిలో మహిళ వైద్యులు ఉన్నందున ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మహిళా వైద్యులు మహిళలకు వైద్య సేవలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హోలీ ఆనందాల కేళి..

- నేడు హోలీ పండుగ
- రంగుల కొనుగోళ్లతో దుకాణాల వద్ద సందడి
- సహజ రంగులు వినియోగించాలని పర్యావరణ వేత్తల సూచన
- ముస్తాబైన ఆలయాలు
- పలుచోట్ల కామ దహనాలు

రంగుల పండుగకు వేళైంది.. చిన్నాపెద్ద, ఆడామగ తారతమ్యం లేకుండా రంగుల ప్రపంచంలో మునిగిపోనున్నది. హోలీ.. హోలీల రంగ హోలీ.. చెమ్మకేళిల హోలీ.. అని పాడుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. సోమవారం రాత్రి కామదహనాలను వాడవాడలా నిర్వహించారు.

నవతెలంగాణ-నల్లగొండ



హోలీరె రంగ హోలీ చమ్మకేళిరె హోలీ.. అంటూ రంగుల పండుగను ఆనందోత్సవాల మధ్య చిన్నా పెద్దా తేడాలేకుండా జరుపుకొంటారు. పల్లె, పట్టణం, గల్లీ, వాడాల్లో ఈ రంగుల పండుగను జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ పండుగ కేవలం రంగులకే కాకుండా దావత్‌లకు కూడా పెద్ద పండుగనే. స్నేహితులు, బంధువులంతా కలిసి ఆనందంగా గడుపుతారు. ఫాల్గుణ మాసంలోని పౌర్ణమి రోజు ఈ పండుగ వస్తుంది.

కామదహనం..

హోలీ పండుగ ముందు రోజు రాత్రి అన్ని గ్రామాల్లోని రహదారుల వద్ద పిడకలు, కట్టెలు పేర్చి కాముడిని దహనం చేస్తారు. ఆ మరుసటి రోజు హోలీ పండుగ జరుపుకొంటారు. గ్రామాల్లో ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి మక్కలు, శనగలు, ఇతర ధాన్యాలు సేకరించి, కొత్త కుండలో వేసి ఉడకబెడుతారు. కామదహనం చుట్టూ వేస్తూ నీటిని పోస్తారు. మరుసటి రోజు కాముని బూడిదను ఇంటికి తీసుకెళ్తారు. ఇదో ఆనవాయితీ. హోలీ పండుగ రోజు వదినా మరదళ్లు, బావా బామ్మరుదులు, వరుసైన వారు రంగులు చల్లుకుంటారు.

జాజిరి.. జాజిరా....

కామదహనాన్ని పురస్కరించుకుని జాజిరి.. జాజిరా.. అంటూ హోలీ పాటలు పాడుతూ గ్రామాల్లో చిన్నారులు కోలలు ఆడుతూ వీధుల్లో తిరుగుతూ చందాలు తీసుకుంటారు. కామదహనం నాడు ఆ కోలలను ఒక్కచోట చేర్చి, మన్మథున్ని ప్రతిమను తయారు చేసి కామదహనం చేస్తారు. మరుసటి రోజు హోలీలె రంగ హోలీ అంటూ మహిళలు చప్పట్లు కొడుతూ ఇండ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు వెళ్లి చందాలు తీసుకుంటారు.

సహజ రంగులు ఆరోగ్యకరం...

సహజ సిద్ధమైన వాటికి బదులుగా కెమికల్స్‌తో కూడిన రంగులతో పండుగ జరుపుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కెమికల్స్ కలిసిన రంగుల వాడకంతో చర్మం ఎర్రబడడం, దద్దుర్లు రావడం, తిమ్మిర్లతో పాటు కండ్లలో పడితే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే జాగ్రత్తలు పాటించి హోలీ పండుగను జరుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో మోదుగ, బంతి, కుసుమ పూల నుంచి పసుపు రంగు, గోరింటాకు నుంచి ఆకుపచ్చ రంగు, ఎర్రచందనం, జాప్రా మొక్కల నుంచి ఎరుపు రంగు, వాయిల్ ఆకుల నుంచి నలుపు రంగును తయారు చేసేవారు. వీటి ఆకులు, పూల రెక్కలు, విత్తనాలను వేడి నీటిలో బాగా ఉడక బెట్టడంతో తయారయ్యే రంగులు ఆరోగ్యానికి మంచివి. నిమ్మ, పసుపు, కుంకుమను వాడడంతో తయారయ్యే ఈ రంగులు వసంత రుతువు ప్రారంభంతో వాతావరణంలో కలిగే మార్పులను తట్టుకోగలిగే శక్తిని శరీరానికి అందిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు.



రసాయన రంగులతో జాగ్రత్త...

డాక్టర్ అనిత రాణి (చర్మవ్యాధి నిపుణులు)



హోలీకి వినియోగించే రసాయన రంగులతో చర్మవాధులు వచ్చే అవకాశం ఉంటుంది. గ్రీసు, ఆయిల్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. ఇలాంటి రంగులతో దురద, దద్దుర్లు ఇతరత్రా చర్మ వ్యాధులు వస్తాయి. రంగులు కళ్లల్లో పడితే నలవడం, రుద్దడం చేయకుడదు. చల్లని నీటితో శుభ్రం చేసి, అవసరమైతే నేత్ర వైద్యుడిని సంప్రదించాలి. ప్రకృతి సిద్ధంగా లభించే రంగులు వాడడంతోనే ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుంది.

సంతోషాల పండుగ. ..

బొంతల శంకర్ (మీసేవ నిర్వాకుడు, నల్లగొండ)



హోలీ అంటే సంతోషాలు తీసుకొచ్చే పండుగ. ప్రతి ఏడాది పండుగకు రెండు రోజుల ముందే మా దోస్తులతో కలిసి మోదుగ పూలు తీసుకొచ్చి ఎండ బెట్టి వాటిని నీటిలో నాన బెడితే వచ్చే రంగు చల్లుకుంటాం. లేదంటే మామూలుగా దొరికే సహజ సిద్ధమైన రంగులను వాడుకుంటాం. అందరం కలిసి ఒకరిపై ఒకరం రంగులు పోసుకుంటూ ఆనందంగా గడుపుతాం.

భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్స్ ఇవ్వాలి

- లేదంటే పోరాటం తప్పదు

నవతెలంగాణ-నిడమనూరు



భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మోటార్ సైకిల్స్ ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త పోరాటం తప్పదని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ నిడమనూరు మండల జనరల్ బాడీ సమావేశం స్థానిక మార్కెట్ యార్డులో పోలేపల్లి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న కార్మికుల అందరికీ మోటార్ సైకిల్ ఇస్తామని మంత్రి టీ.హరీశ్‌రావు ప్రకటించారు. మే1న లక్ష మోటార్ సైకిల్ ఇస్తామని కార్మికశాఖ మంత్రి సిహెచ్.మల్లారెడ్డి కూడా ప్రకటించారు. 10 నెలలు గడిచిన నేటికి ఎలాంటి విధి విధానాలు రూపొందించలేదని, వెంటనే మోటార్ సైకిల్స్ ఇవ్వాలని కోరారు. కార్మికులందరినీ వెల్ఫేర్ బోర్డులో సభ్యులుగా చేర్పించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నైనా నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ పథకాలు రెట్టింపు చేయాలన్నారు. తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో 3 వేల700 కోట్లు మూలుగుతున్న పెండింగ్ క్లెయిమ్స్‌ని క్లియర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 54 వేల క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణాలు సహజ మరణాలు వివాహ ప్రసూతి కానుకలు ఇతర బెనిఫిట్స్‌కి ఇచ్చే నష్టపరిహారం పెంచాలని కోరారు. ఏ సమస్య పరిష్కరించాలని లేబర్ ఆఫీస్‌కి వెళ్ళిన ఖాళీ పోస్టులు ఉన్నాయని, పని భారం పెరిగిందని అధికారులు అంటున్నారని, అందుకే ఖాళీగా ఉన్న ఏఎల్ ఓ, ఏసీఎల్, డీసీఎల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం కార్మికుల పేర్లు నమోదు చేయాలని, గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోదండ చరణ్‌రాజ్, అధ్యక్షులుగా ఇంజమూరి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి సైదులు, కోశాధికారిగా పోలేపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులుగా పోతుగంటి కోటయ్య, సాదు, నగేష్ , దాసరి సైదులు, సహాయ కార్యదర్శిలుగా ఎం.చంద్రశేఖర్, డీ. సోమయ్య, ఎం. నాగార్జున, కమిటీ సభ్యులుగా ఎం. సెంచులు, ఎస్‌కే. హజరత్, బీ. కృష్ణ, కే.సైదులు, డీ.లక్ష్మయ్య, డీ.లక్ష్మణచారి, డీ. ప్రసాద్, ఎన్.సురేందర్ , పుట్ట వెంకన్న ఎన్నికయ్యారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

- బాపూజీ నగర్‌లో ఖాళీ సిలిండర్లతో నిరసన

నవతెలంగాణ-మిర్యాలగూడ



పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని బాబూజీ నగర్ కాలనీ వాసులు ఖాళీ సిలిండర్లు రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేకమార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. 400 రూపాయలు ఉన్న వంట గ్యాస్ 1200 రూపాయలకు చేరుకుందని, రోజు కూలికి వెళ్తేనే కుటుంబం గడిచేదని అలాంటి పరిస్థితుల్లో గ్యాస్ కొనలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. కట్టెల పొయ్యి దిక్కేనంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, ముతమ్మ, కవిత, వరమ్మ, అమీనా, కలమ్మ, భారతి, విజయ, గౌసియ, భవానీ, ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్. శివరాజు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో...

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రధాని మోడీ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ మాట్లాడుతూ సామాన్యుని నడ్డి విరుస్తూ కార్పొరేట్ శక్తులకి అనుకులంగా కేంద్ర ప్రభుత్వం తన ఇష్టం వచ్చినట్లు పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం చూస్తుంటే మహిళలను మళ్ళీ కట్టెల పొయ్యి పై వంట చేసి కన్నీరు తెచ్చేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధీరావత్ మోహన్ నాయక్, పోతుగంటి కాశి, రామాంజి జిల్లా నాయకులు వీరయ్య, శ్రీను నాయక్, శేఖర్, సైదులు, స్నేహ, సైదమ్మ ఇద్దయ్య, ఇమ్మానియెల్, సందీప్, పరమేష్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణీ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తగు ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూమ్, భూ సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మాత్రమే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతిలాల్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్' ఇండ్లు కేటాయించాలి

- ఆర్డీఓ ఆఫీస్ ముందు ధర్నా
- విచారించి న్యాయం చేస్తాం: మున్సిపల్ ఛైర్మెన్

నవతెలంగాణ-మిర్యాలగూడ



అర్హులకే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని ఆయా వార్డులకు చెందిన పేదలు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, సొంత ఇండ్లు, భూములు ఉన్నవారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ సరిగా చేయలేదని, దాని వలన అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందకుండా పోయాయని విమర్శించారు. 27వ వార్డులో ఐదుగురికి సొంత ఇండ్లు ఉన్నప్పటికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయని, వాటిపై విచారణ జరిపించాలని ఆ కాలనీ ప్రజలు తహసీల్దార్ అనిల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలను మున్సిపల్ ఛైర్మెన్ భార్గవ్ శాంతి పరిచారు. అన్ని వార్డుల్లో లబ్ధిదారుల ఎంపిక సరిగా జరగలేదని, విచారణ సరిగా చేయకపోవడంతో అర్హులకు అన్యాయం జరిగిందని తెలిపారు. అని వార్డుల్లో రీ సర్వే చేయాలని ఆర్డీవో తాసిల్దారులకు వివరించామని తెలిపారు. అర్హులకు ఇండ్లు వచ్చే విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపికైన లబ్ధిదారులను సమగ్రంగా విచారించి అర్హులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

'ఉపాధి పనులను వేగవంతం చేయాలి'

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ - గ్రామీణ పేజ్ 2 శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ట్విన్ పిట్‌ల నిర్మాణం మొదలైన అంశాలపై గ్రామాల్లో సర్వే నిర్వహించి బడ్జెట్ తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల నిర్వహణ, మహిళా సంఘాల పనితీరు పై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను వేగవంతం చేయాలని, లేబర్ బడ్జెట్ కనీసం గ్రామానికి వంద మంది కూలీలు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్యం నిర్వహణ, కంపోస్ట్ షెడ్‌లలో సేంద్రియ ఎరువుల తయారీ విషయంలో మరింత శ్రద్ధ చూపాలని తెలిపారు. మహిళా సంఘాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ టార్గెట్ 37.51 కోట్ల గాను 34.51 కోట్ల రుణాలను పంపిణీ చేయడం జరిగిందని అధికారులు వివరించారు. స్త్రీనిధి రుణాలు పంపిణీ లక్ష్యం 5 కోట్ల 68 లక్షల గాను, 4 కోట్ల 78 లక్షల రూపాయలను అర్హులకు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ లో గ్రామాలను ఒడీఎఫ్ ప్లస్ ప్రమాణాలను నిర్వహించుటకు గాను పంచాయితీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్ లకు, టెక్నికల్ అసిస్టెంట్లులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి కో ఆర్డినేటర్‌ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లాజర్, ఎంపీఓ పద్మ, ఎస్బిఎం కోఆర్డినేటర్ శంకర్‌బాబు, మొయినుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, ఏపీఓ శ్రీలత, ఐకేపీ ఏపీఎం పద్మ, మండలం లోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ప్రథమ చికిత్స ఆపన్న హస్తం..

- అడిషనల్ ఎస్పీ. కేఆర్‌కే. ప్రసాదరావు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు ఆపదలో ఉన్నవారికి ప్రథమ చికిత్స ఆపన్న హస్తం అని అడిషనల్ ఎస్పీ కేఆర్‌కే.ప్రసాదరావు పేర్కొన్నారు. రోడ్డు భద్రత ప్రమాదంలో ప్రథమ చికిత్స అనే అంశాలపై అదనపు డీజీ బీ. శివధర్ రెడ్డి సూచన మేరకు ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 'ఆక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండట్రైనింగ్ కోర్సు' పేరిట నార్కట్‌పల్లి పోలీసుశాఖ తలపెట్టిన కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ ప్రసాదరావు సోమవారం స్థానిక హోటల్ వివేరలో ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి చేయాల్సిన ప్రథమచికిత్స, అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ సేవలను అందించే విధానాన్ని డాక్టర్ మధుసూదన్ మాక్ డ్రిల్ చేసి వివరించారు. ప్రమాదం జరిగినప్పుడు వెన్నుపూస మెడ శరీర భాగాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఫిట్స్ వచ్చినప్పుడు కరెంటు షాక్ తగిలినప్పుడు, ఎండ దెబ్బ తగిలినప్పుడు, తక్షణం అందించాల్సిన ప్రథమ చికిత్స పై వివరించారు. అడిషనల్ ఎస్పీ ప్రసాదరావు మాట్లాడుతూ.. 2000-2021-22 సంవత్సరంలో అత్యధికంగా నార్కట్పల్లి చిట్యాలలో గుండెపోటుతో మరణించినట్లుగా గుర్తించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 60 పోలీస్ స్టేషన్లో పరిధిలో ప్రమాదము ప్రథమ చికిత్సపై ఆర్ఎంపీ డాక్టర్లకు ఆటో డ్రైవర్లకు దాబా హోటల్ యజమానులకు సెక్యూరిటీ గార్డులకు పోలీస్ సిబ్బందికి ప్రమాదంలో ప్రథమ చికిత్స అందించే విధానాన్ని ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతవిభాగం డీఎస్పీ చంద్రబాను, నార్కట్‌పల్లి సీఐ కే. శివరాంరెడ్డి, నార్కట్ పల్లి ఎస్సై బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంట్ల నర్సిరెడ్డికి నివాళులు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని జువ్వి గూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ గంట్ల నర్సిరెడ్డి మరణించారు. సోమవారం ఆయన మృతదేహానికి జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టరియల్ రాష్ట్ర అధ్యక్షులు ఏపాల సత్యనారాయణరెడ్డి, బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గద్దపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన జరిగే నాటికలివే..

నవతెలంగాణ-మిర్యాలగూడ


నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఈ నెల 10వ తేదీ నుంచి జాతీయస్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాంస్కృతి కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక వినాయక దేవాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కిరణ పదవ తేదీన నాటికల ప్రారంభోత్సవం చేశాక రాత్రి 8 గంటలకు రేపల్లెకి ఇట్‌సెల్ఫ్ గురుమిత్ర కళా సమితిచే 'కొండ' సాంఘిక నాటిక, 11న సాయంత్రం 6.30 గంటలకు ఖమ్మంకు ం చెందిన శ్రీ భక్త రామదాసు కళామండలిచే 'శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మహత్యం' పద్య నాటకం, రాత్రి 9 గంటలకు ఒంగోలులోని కొప్పులుకు చెందిన పండు క్రియేషన్స్‌చే 'పక్కింటి మొగుడు' సాంఘిక నాటిక, 12న సూర్యాపేట జిల్లా హుజూర్‌గర్‌కు చెందిన సప్తస్వర నాట్య కళామండలిచే 'మహామంత్రి తిమ్మరుసు' పద్య నాటిక, గుంటూరు జిల్లాలోని తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్‌చే 'వెండి అంచులు' సాంఘిక పోటీలు,13న కాకినాడకు చెందిన సీతారామాంజనేయ నాట్యమండలిచే 'నర్తనశాల' పద్య నాటకం 14న గుంటూరులోని శ్రీ సమతా గురుకులం 'పల్నాటి యుద్ధం' పద్య నాటకం, అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాదులోని శ్రీ లక్ష్మీనరసింహ కళామండలి 'మలిసంధ్య' సాంఘిక నాటకం, 15న హైదరాబాద్‌కు చెందిన కర్టెన్ కాల్ థియేటర్ 'పెట్రో మార్క్స్ పంచాయతీ' సాంఘిక నాటిక అదే రోజు రాత్రి 7.30 కు కర్నూలుకు చెందిన లలిత కళా సమితి ఆధ్వర్యంలో 'శ్రీకష్ణ కమల పాలిక' పద్య నాటకం, 16న హైదరాబాద్‌కు చెందిన శ్రీ మురళీకష్ణ సంస్కృతి కళా సంగంచే 'వసంత రాజీయం', 9 గంటలకు హైదరాబాద్కు చెందిన సిరిమువ్వ కల్చరల్ ' థింక్' సాంఘిక నాటిక, 17వ తేదీన కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి 'చీకటి పువ్వు" సాంఘిక నాటకం, అదే రోజు రాత్రి 7:15 నిమిషాలకు విజయనగరంకు చెందిన శ్రీ శ్యామలంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఆదికవి నన్నయ్య' పద్య నాటకం, రాత్రి 9:30 గంటలకు గుంటూరుకు చెందిన రసఝరి 'గుర్తుతెలియని శవం' సాంఘిక నాటకం, 18వ తేదీన గుంటూరుకు చెందిన శ్రీ దుర్గాభవాని నాట్యమండలిచే 'జై శ్రీ కళ్యాణ శ్రీకష్ణ' పద్య నాటకం, అదే రోజు రాత్రి 9 గంటలకు వరంగల్‌కు చెందిన మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్ 'ఉన్నది ఒకటే జీవితం' సాంఘిక నాటకం, అదే రోజు రాత్రి 9 గంటలకు అనకాపల్లికి చెందిన శ్రీ మాతశ్రీ కళానికేతన్ ఆధ్వర్యంలో 'పనికిరాని వాడు' సాంఘిక నాటకం, 20 తేదీన సాయంత్రం 6 గంటలకు వరంగల్‌కు చెందిన వరంగల్ స్టార్ బ్రదర్స్ సంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో 'విజయనిరుద్ధం' పద్య నాటకం, అదే రోజు రాత్రి 8:30 గంటలకు ముగింపు బహుమతుల ప్రధాన ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ముగింపు సభకు పర్యటక, క్రీడా, సాంస్కృతిక, ఆబ్కారి శాఖ మంత్రి వీ. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై పోటీల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సాంస్కృతిక కళా కేంద్రం నిర్వహణ కార్యదర్శి పీ.రామవతారం, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, కోశాధికారి పీ.లక్ష్మీనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలి

నవతెలంగాణ-నకిరేకల్

మహిళలు ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ప్రసూతి వైద్య నిపుణుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రాపోలు మంజుల రఘునందన్, ఐఎంఏ నకిరేకల్ యూనిట్ అధ్యక్షుడు రాపోలు రఘునందన్ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో నల్లగొండ ఓబీజీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న హింస, లైంగిక వేధింపులను దీటుగా ఎదుర్కోవాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న వివక్షతను రూపుమాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఉమా కృష్ణమూర్తి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన సీవోఈ ఎంట్రెన్స్ పరీక్ష

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల పరీక్షాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్మిషన్ ఎంట్రన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో 316 మంది విద్యార్థులకుగాను 297 విద్యార్థులు హాజరు కాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎ.భిక్షమయ్య తెలిపారు.కేంద్రాన్ని గురుకుల పాఠశాలల జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఎన్.రజిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ ఆఫీసర్ నిర్మల మేరీ, ఎగ్జామ్ ఇన్‌చార్జి ఎస్.వెంకటస్వామి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

నవతెలంగాణ-తుంగతుర్తి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ అన్నారు.మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన తాటికొండ సోమలక్ష్మి చెందిన రూ.22000 సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం తిరుమలగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె భర్త తాటికొండ సీతయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎంతో మంది పేదలు కార్పొరేట్ వైద్యం చేసుకుంటున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, మండల నాయకులు చెరుకు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం చలో పార్లమెంట్

- మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



పోరాడి సాధించుకున్న కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసమే ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని, గిట్టుబాటు ధరల చట్టంపై భారత రైతాంగాన్ని నమ్మించి మోసం చేసిన మోడీ ప్రభుత్వం గద్దె దింపడానికి కార్మికులు ,కర్షకులు ఐక్యంగా ఢిల్లీ కదలి రావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన కార్మిక ,కర్షక జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు.75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి రాజ్యాంగం కల్పించిన సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేసిందన్నారు.కనీసవేతనాల జీవోలను సవరించకపోవడం వల్ల షెడ్యూల్, నాన్‌షెడ్యూల్ ప్రాంతాల్లో చట్ట ప్రకారం వేతనాలు అమలు కావడం లేదని విమర్శించారు.గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.178గా మోడీ ప్రభుత్వం ప్రకటించన సుప్రీంకోర్టు డైరెక్షన్‌ను ఉల్లంఘించడమే నన్నారు.అసంఘటిత కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలివ్వాలని, వ్యవసాయ కార్మికులకు రోజు వేతనం రూ.600 లకు పెంచాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంత పేదలకు విస్తారంగా పని చూపుతున్న గ్రామీణ ఉపాధిపనికి 30 శాతం నిధులను కోత విధించడం వెనక భవిష్యత్‌లో ఈ పనిని ఎత్తివేయాలని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు.ఇప్పటికే ఐదు కేజీల సబ్సిడీ బియ్యాన్ని ఎత్తివేసిందన్నారు.మరోవైపు నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించడంలో విఫలమైందన్నారు..వంట గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుని జీవితం దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతాంగ రుణమాఫీని చేయడానికి సిద్ధపడని మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్లకు బడ్జెట్లో 25 కోట్ల రూపాయలను రాయితీలను ప్రకటించిందన్నారు. రైతులకు విత్తనాలు, మందులపైన ఇప్పుడే సబ్సిడీని ఎత్తివేసిందన్నారు. రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50శాతం కలిపి పంటలకు గిట్టుబాటు ధరల నిర్ణయించే చట్టాన్ని తీసుకొస్తానని చెప్పిన మోడీ ప్రభుత్వం రైతాంగాన్ని నమ్మించి మోసం చేసిందన్నారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు పల్లె వెంకటరెడ్డి,సీఐటీయూ జిల్లా నాయకులు చెరుకు ఏకలక్ష్మి,సోమపంగ రాధాకృష్ణ, శీలం శ్రీను, రైతుసంఘం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మందడి రాంరెడ్డి, దేవరం వెంకటరెడ్డి, దేవిరెడ్డి స్టాలిన్ రెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసుసత్యం, సిరికొండ శ్రీను,నారసాని వెంకటేశ్వర్లు, నల్లమేకల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలపై అధికారులు స్పందించాలి

- మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి
- ఆరోగ్య మహిళ కేంద్రాలు ప్రారంభం
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి ప్రజావాణిలో చేసుకున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ యస్.వెంకట్రావు జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, యస్.మోహన్‌రావులతో కలిసి మాట్లాడారు.జిల్లాలో మహిళా దినోత్సవం ఘనంగా జరపాలని దేనికోసం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి మహిళా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయాలన్నారు.జిల్లాలో 8 ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని, ప్రతి మంగళవారం ఈ కేంద్రాలలో మహిళలకు పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్స అందించేందుకు తో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాలుగు నియోజకవర్గాలలో జరుగు కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యానంగా గ్రామీణ ప్రాంతాలలో పశువుల కొరకు నీటి తొట్లలో నీటిని ఈ వేసవి కాలంలో నీటిని నింపాలని అలాగే నాటిన మొక్కలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 35, గ్రామీణాభివృద్ధి శాఖ 9, ఇతర శాఖలకు సంబంధించి 10 మొత్తం 54 దరఖాస్తులు అందాయని అట్టి వాటిని తగు చర్యలు అధికారులకు పంపించామన్నారు.

జిల్లాలో పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో మార్చి,ఏప్రిల్ మాసాలలో నిర్వహించే పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని విద్యా అనుబంధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ యస్. వెంకట్రావు ఆదేశించారు. జిల్లాలో పది , ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ పై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, యస్. మోహన్‌రావులతో కలిసి మాట్లాడారు.ఏప్రిల్ 3 నుండి 13 వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 13.45 వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే 69 కేంద్రాలలో 12386 మంది విద్యార్థులు హాజరవుతున్నందున ముందుగా అన్ని మౌలికవసతులు కల్పించాలని కోరారు.ముఖ్యంగా తాగునీరు, నిరంతర విద్యుత్, ఏఎన్ఎంతో పాటు మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు 33 కేంద్రాలలో 16390 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతున్నారని మొదటి సంవత్సరం 6727 అలాగే రెండోవ సంవత్సరం 7089 మంది , వొకేషనల్ మొదటి సంవత్సరం 1515, రెండవ సంవత్సరం 1399 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనుచున్నందున వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని అలాగే ప్రభుత్వ నిబంధనలకు లోబడి అన్ని కేంద్రాలో నియమించిన సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈఓ అశోక్, డీపీఓ యాదయ్య, డీఐఈఓ కృష్ణయ్య, పోలీస్, మెడికల్, పోస్టల్, విద్యుత్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-తుంగతుర్తి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను మండలంలోని వీఎన్ భవన్‌లో ఆయన ప్రారంభించి మాట్లాడారు.దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ అత్యధికంగా ఉన్న కార్మికులకు రైతులకు మేలు చేయకుండా కొద్దిమంది కార్పొరేట్‌శక్తులకు కోట్లాది రూపాయలు రాయితీలు ఇస్తూ వారికి కొమ్ముగాస్తున్నారని విమర్శించారు.అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు.ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పుతూ యువతకు ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.మతం పేరుతో ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం ఈ దేశంలో మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో నాలుగుకోడ్‌లను తెచ్చి యూనియన్‌లను పెట్టుకునే అవకాశం లేకుండా, పని భద్రత లేకుండా కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్లాచట్టాలను తేవడంతో 13 నెలలు పోరాడి ఎందరో మంది చనిపోయినాక మేము పొరపాటు చేశామని వాటిని రద్దు చేస్తామని మోడీ చెప్పడం దారుణమన్నారు.ప్రశ్నించే గొంతుకను జైల్లో వేస్తున్నారన్నారు.దేశంలో బీజేపీ, దాని మిత్రపక్షాల పార్టీలను కాకుండా ఇతర ప్రభుత్వాలను ఈడీలు,సీబీఐ, ఇతర దాడుల పేర ఆ ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నం మోడీ చేస్తున్నారని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడి నిరుద్యోగ సమస్యను తొలగించి దేశంలో ఉన్న పేద ప్రజలకు మేలు కలిగే చట్టాలను రూపొందించి ప్రజా ఉపయోగకరమైన పనులు చేపట్టాలని కోరారు.అంతకుముందు అపార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకుడు ఓరుగంటి అంతయ్య ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి,మండల కార్యదర్శులు కల్లేపల్లి భాస్కర్, ఉప్పలయ్య, శ్రీనివాసు, నాయకులు పల్లా సుదర్శన్, కడెం లింగయ్య, ముత్తయ్య, ఎల్లయ్య, సోమయ్య, యాదగిరి, లక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్



బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని యర్రవరం గ్రామంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలందరూ సమిష్టిగా కలిసి బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సూచించారు. ఎర్రవరం గ్రామంలో వెలసిన బాల ఉగ్ర నరసింహ స్వామి ఈనెల 10వ తేదీన శంకుస్థాపన కార్యక్రమం ఉండటం వలన గ్రామానికి ముఖ్య నాయకులు వస్తారని తెలిపారు. అందరూ కలిసికట్టుగా సమన్వయంతో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు భాషబోయిన భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలో జరిగే కార్యక్రమానికి అందరం కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించాలని, 20 మంది యువకులను వాలంటీర్లుగా ఏర్పాటుచేసి అన్నదాన కార్యక్రమాలు వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడడానికి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు రావుల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షరలు బెల్లంకొండ వెంకటేశ్వర్లు,దేవాలయ కమిటీ చైర్మెన్ నలజాల జగన్నాథం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్

తుంగతుర్తి: సీఎం కేసీఆర్ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ,డీసీఎంఎస్ డైరెక్టర్ గుడిపాటి సైదులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని వెంపటి గ్రామంలో తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ గౌడ్ తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో కంటి జబ్బులతో బాధపడుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మరో బృహత్తర పథకం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండ గాని వీరస్వామి, ఉపసర్పంచ్ భాషబోయిన వెంకన్న,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ నాగు నాయక్, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, హెచ్ఇఓ సముద్రాల సూరి, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, యాదగిరి, కార్యదర్శి శ్రీధర్, బిఆర్ఎస్ నాయకులు కొండగడుపుల నాగయ్య, తునికి సాయిలు, తునికి లక్ష్మమ్మ, చెరుకు పరమేష్, రచ్చ నవీన్, జెక్కి సతీష్, పుల్లూరు పరశురాములు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

నవతెలంగాణ-తిరుమలగిరి



భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అదే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకుడు చెరుకు సుధాకర్ కొడుకుకి ఫోన్ చేసి, ఫోన్లో ఇష్టం వచ్చినట్లుగా అనుచిత వ్యాఖ్యలు మాట్లాడినటువంటి ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు కోరారు.సోమవారం మండలకేంద్రంలో తిరుమలగిరి బీసీ ముఖ్యనాయకులు, వివిధ సామాజిక ఉద్యమ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో చెరుకు సుధాకర్ యొక్క పాత్ర ముఖ్యమైనదని, ఎప్పుడూ ప్రజల కోసం ప్రజల సమస్యల కోసం పరితపించే బడుగు బలహీన వర్గాలకు చెందినటు నాయకులు అన్నారు.ఆయన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు.అటువంటి వ్యక్తి ఎంపీ వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొత్తగట్టు మల్లయ్య, ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమయ్య, జంబుద్వీప జనసమితి రాష్ట్ర కన్వీనర్ పత్తెపురం యాదగిరి, ఎస్సీ నాయకులు కృష్ణనాయక్, శ్రీనునాయక్, బీసీ నాయకులు గాదరబోయిన లింగయ్య, అంబటి మహేష్‌గౌడ్, పోరెళ్ల విప్లవ్,చిత్తలూరి కృష్ణమూర్తి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పబ్లిక్ పరీక్షలపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు వెంకన్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఎన్.రవి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు రాయబోయే విధానాన్ని గూర్చి వారికున్న సందేహాలను నివృత్తి చేయడం కోసం, భయాన్ని, ఆందోళన, తొలగించడం కోసం మండలంలో ఏడుగురు ఉపాధ్యాయుల చేత అన్ని సబ్జెక్టుల మీద విద్యార్థులందరికీ ప్రశ్నాపత్రాల సరళిని గురించి తదితర విషయాలను టీచర్ల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆసియా జబీన్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, జాన్ షరీఫ్, ప్రభాకర్, గుండా వెంకటేశ్వర్లు, జమాల్ షరీఫ్, ఉపేందర్, కృష్ణప్రియ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలోని ప్రాచీన రుక్మిణి సత్యభామ గోదాదేవి సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి నవ కలశ స్నపనం పంచామృత అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం జరిపి 9 కళాశాలలో పంచామృతాలు, పవిత్ర నదీ జలాలు సుగంధ ద్రవ్యాలు నింపి స్వామివారి ఉత్సవమూర్తులకు మూల మూర్తులకు అభిషేకము జరిపారు.వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య, దేవాలయ అర్చకులు ముదుంబా విష్ణువర్ధనాచార్య గ్రామ పురోహితులు రాకేష్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అభిషేకం తరువాత స్వామివారికి దేవాలయ ధర్మకర్తలు యాదా నరసింహారావు - నిర్మల, మహేష్-కన్యాకుమారి దంపతులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. నేడు స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం జరగనున్నది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మెన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ అనిత, నందుల లక్ష్మీనరసింహ శాస్త్రి, యాదా హనుమంతరావు, గుండపనేని ప్రభాకర్‌రావు, అమరబోయిన శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కన్నెబోయిన సింగరయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపాలిటీ పరిధిలోని 7వవార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్, శాసనమండలి సభ్యులు తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు సందర్శించారు.కంటి పరీక్షలు నిర్వహించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, క్యాంప్ డాక్టర్ వాసవి, లలిత, పూర్ణ శేఖర్,విజయ్,ధనమ్మ, వార్డు ఆఫీసర్ మన్సూర్, ఆశావర్కర్స్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-హుజూర్‌నగర్

మండల పరిధిలోని అమరవరం గ్రామంలో జరిగిన జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సైదిరెడ్డి రజిత దంపతులుపాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. సైదిరెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత అభివృద్ధికి జెడ్పీటీసీ సైదిరెడ్డి చేస్తున్న అభివృద్ధిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత అంజిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిశోధనలు ప్రయోగాలకు పునాది

- మండల విద్యాధికారి సలీం షరీఫ్

నవతెలంగాణ-కోదాడరూరల్

పరిశోధనలు ప్రయోగాలకు పునాది అని మండల విద్యాధికారి సలీం షరీఫ్ అన్నారు. పట్టణంలోని జయ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండే పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచు కోవాల్లన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని పెంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రక్త పరీక్షలు నిర్వహించే మెడికల్ కిట్స్, సంస్కృతి సంప్రదాయాలు తెలిపే బొమ్మల కొలువులు, హైడ్రాలిక్ మిషన్, రాకెట్ వంటి పలు అద్భుతమైన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. జయ సృష్టిని ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను, శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించగలుగుతున్నామని కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జల్లా పద్మ బింగి, జ్యోతి ప్రధానోపాధాయయులు చిలువేరు వేణు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయంభు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-చివ్వెంల

మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగసమేత వెంకటేశ్వర స్వామి అధ్యయనోత్సవ బ్రహ్మోత్సవ కల్యాణోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ మారినేని సుధీర్‌రావు మాట్లాడుతూ వందల ఏండ్ల చరిత్ర కలిగిన స్వయంభు వెంకటేశ్వర స్వామి భక్తుల కోరికలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి చెందారన్నారు.ప్రభుత్వం నుంచి మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో వెంకటేశ్వర స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారని చెప్పారు.దీంతో పాటు దాతల సహకారంతో మరో రూ.50 లక్షలు సేకరించి ఈ దేవాలయాన్ని మహా క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేడు జరిగే గరుడ ముద్దా స్వామివారి కల్యాణోత్సవానికి రాష్ట విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి,ఇతర ప్రముఖులు హాజరవుతున్నట్లు దేవాలయ కమిటీ చైర్మెన్ ముద్దా వెంకన్న యాదవ్, ఆలయ ఈవో కుశలయ్య వెల్లడించారు. స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. శివాలయంలో కోలా సుబ్బయ్య శాస్త్రి ,శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పురోహితులు ముదుంబా లక్ష్మీనరసింహ చార్యులు, నాగరాజు ఆచార్యులు, శ్రవణ్ కుమార్‌చారి, సర్పంచ్ బోయిల కృష్ణ, ఉపసర్పంచ్ కృష్ణ, దేవాలయ కమిటీ సభ్యులు కలగాని వెంకన్న,శిగ వీరస్వామి, శిగ శ్రీను, కోడి శోభన్ బాబు, కృష్ణ,గుద్దేటి చిన్న వెంకన్న, సీతారామారావు, పూర్ణచందర్‌రావు, లింగాల సతీష్, శివరాత్రి రమేష్, శ్రీశైలం, అనంతుల ఆంజనేయులు, మల్సూర్, దేవాలయ కమిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కక్కిరేణి-రామన్నపేట బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-రామన్నపేట

వర్షాలకు అస్థవ్యస్తంగా తయారై గుంతలమయంగా మారిన కక్కిరేణి - రామన్నపేట బీటీరోడ్డుకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు.ఇంటింటికీ సీపీఐ(ఎం) కార్యక్రమంలో భాగంగా సోమవారం కక్కిరేణి గ్రామంలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామన్నపేట నుండి కక్కిరేణి వరకు బీటీరోడ్డు ధ్వంసం కావడంతో ఆర్టీసీ అధికారులు కనీసం బస్సు కూడా నడపకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమ వుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యకారమంలో మండల కమిటీ సభ్యులు వేముల సైదులు, శాఖ కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య,మహేందర్, శివకుమార్, మర్రి అండాలు, పిండి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పురపాలక సంఘంలోని బహదూర్‌పేట, సాయిగూడెం, పట్టణంలోని అన్ని వార్డులలో ప్రజలు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని పురపాలక కమిషనర్ సోమవారం తెలిపారు.తీవ్ర వేసవి కారణంగా రానున్న రోజుల్లో మార్చి ,ఏప్రిల్, మే, జూన్ నెలలలో ఎండల తీవ్రత అధికంగా ఉండే కారణంగా నీటి ఎద్దడి తలెత్తడంతో తాగునీరు దొరకక మూగ జీవాలు విచ్చలవిడిగా తిరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు, విద్యార్థులు కుక్కల గుంపులకు దూరంగా ఉండాలని, కుక్క వెంబడించినప్పుడు పరిగెత్తకుండా ఒకేచోట నిలబడాలన్నారు.పిల్లలు అధికంగా ఉన్న తల్లి కుక్కల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కుక్క తరుముతుంటే వెనక్కు చూస్తూ పరుగెత్తరాదన్నారు.పడుకున్న కుక్కలపై రాళ్లు విసరవద్దన్నారు.వీధి కుక్కల సంతానం అభివృద్ధి చెందకుండా శస్త్ర చికిత్స ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు.



కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాలో, భువనగిరి నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భువనగిరి మండలంలోని బస్వాపురం, హనుమాపురం గ్రామాలలో పర్యటించి, గ్రామాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతంపై చర్చించారు.తెలంగాణ రాష్ట్రంలో పేదలకు ఇండ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు, రేషన్ కార్డులు, పెన్షన్, ధరణి సమస్యల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పైన, సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.అవసరమైతే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేసేందుకు సిద్ధమన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కమిటీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్, మండల అధ్యక్షులు కోటా పెద్దస్వామి, నాయకులు నుచు నాగయ్యయాదవ్, తుమ్మేటి వెంకటేష్, ధర్మారెడ్డి, ఎల్లా రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్,ఎల్లాంల జంగయ్యయాదవ్, చిక్కుల వెంకటేశం, వలందాస్ ఆదినారాయణ, నానం కృష్ణగౌడ్, పాక వెంకటేష్‌యాదవ్, ఎండి.మజహర్, గ్రామ శాఖ అధ్యకులు మచ్చ నవీన్ పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

కలెక్టర్ కార్యాలయంలోని ఈవీఎం గోదామును మాస తనిఖీలో భాగంగా సోమవారం జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టరు డి.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం గోదాములను తనిఖీలో భాగంగా సోమవారం పరిశీలించినట్లు తెలిపారు.ఆయన వెంట వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్ ఉన్నారు.



నంది అవార్డు గ్రహీత జహంగీర్

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామానికి చెందిన బండ జహంగీర్ 2023 సంవత్సరానికి నంది అవార్డు సాధించారు .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్లోని విజయవాడకు చెందిన మహిళా వాకర్స్ క్లబ్ వాసవి సూపర్‌స్టార్ విద్యాధరపురం శ్రీ కన్యకా పరమేశ్వరి సత్రం నందు సంయుక్తంగా నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాలలో విశిష్ట సేవలు అందిస్తున్న కవిగా పాటలు రచయితగా తన ప్రతిభను చూపిస్తున్నందుకు తోటి వికలాంగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను వారి సమస్యల పరిష్కారానికి స్కూల్ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయడం హక్కుల పోరాటానికి చేస్తున్న సేవకు గాను ప్రతిభవంతమైన వికలాంగులకు విశిష్ట సేవలందించినందుకు అవార్డు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం వారిని శాలువాతో ఘనంగా సన్మానించి షీల్డ్ బహూకరించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ మేయర్ భాగ్యలక్ష్మి,వాసవి క్లబ్ అధ్యక్షురాలు పానుగంటి లలిత,రాణి, రవికుమార్,పానుగంటి సుమంత్, శారద, రామలింగరాజు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ఎద్దడిని నివారించాలని భిక్షాటన

నవతెలంగాణ-ఆలేరుటౌన్

తమ గ్రామంలో నెలకొన్న మంచినీటిఎద్దడిని నివారించాలని కోరుతూ మండలంలోని శర్బనాపురం గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు పట్టణంలోని పలు దుకాణ సముదాయాలలో , పట్టణ ప్రముఖుల వద్ద భిక్షాటన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కోరుతూ సమస్యను ఎమ్మెల్యే గొంగిడి సునీత, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు లేవని చెప్పారన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి అనిత విద్యాసాగర్,ఉపసర్పంచ్ గడ్డమీద నరేష్, కే.నరేష్, ఎస్.సురేష్, బి.నరేష్ పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంలో వరితో పాటు చిరుధాన్యాలు పండించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

సమగ్ర వ్యవసాయంలో భాగంగా వరితో పాటు చిరుధాన్యాలు, కూరగాయలు పండించాలని, ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించాలని కలెక్టర్ పమేలా సత్పతి రైతులను కోరారు.సోమవారం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం రైతువేదికలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ డైరెక్టర్లు, రైతులు, ఉత్పత్తిదారుల సంస్థలకు సహాయపడుతున్న స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, నాబార్డు అధికారులతో జరిగిన వాతావరణ మార్పు, అందుకనుగుణంగా పంట మార్పిడి, వ్యవసాయ విధానంలో మార్పులు తదితర అంశాలపై జరిగిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రైతులు సమగ్ర వ్యవసాయ విధానంలో వరి ఒక్కటే కాకుండా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాడి, కోళ్లపెంపకం, చేపల పెంపకం వంటి సమగ్ర వ్యవసాయ పద్ధతుల మీద రైతులు దృష్టి పెట్టాలన్నారు.తమ పంట ఉత్పత్తులను, తద్వారా ఆదాయవనరులను



పెంచుకోవాలని రైతులను కోరారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు కావలసిన తోడ్పాటును క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు అందించాలని, తద్వారా ఉత్పత్తిదారుల సంస్థలు తమ మార్కెటింగ్ అవకాశాలను పెంచుకొని తమ ఉత్పత్తులను మంచి ధరలకు అమ్ముకొని ఆదాయాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక డాట్ సెంటర్ శాస్త్రవేత్త మధుశేఖర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన కలిగే దుష్ప్రభావాలు, దాని వలన వ్యవసాయ రంగంలో కలిగే మార్పులకు రైతులు సిద్ధంగా ఉండాలన్నారు.అందుకనుగుణంగా తమ వ్యవసాయంలో చేసే పద్ధతులు, మార్పులు చేర్పులు చేయాలని, అధిక దిగుబడుల మీద దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి నీలిమ పలు సూచనలు చేస్తూ రైతు ఉత్పత్తిదారులకు కావాల్సిన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుతాయని తెలిపారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ అధికారి రామకృష్ణ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు దేవ్‌సింగ్, వెంకటేశ్వర్లు, పద్మావతి, ఎపి మాస్ ప్రతినిధి గంగాధర్, స్థానిక పీస్ సంస్థ ప్రతినిధి నిమ్మయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-గుండాల

సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు పార్టీలో చేరుతున్నారని డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు.సోమవారం వాసవి గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.మండలంలోని బండకొత్తపెల్లి,పెద్ద పడిశాల,అనంతారం,వంగాల, మాసాన్ పల్లి,వెల్మజాల, సీతారాంపురం గ్రామాల నుండి బండకొత్తపెల్లి ఉపసర్పంచ్ పారుపల్లి లక్ష్మయ్య,మాజీ ఎంపీపీ నత్తి లచ్చయ్య,బొబ్బల సోమిరెడ్డి సీనియర్ నాయకులు బండ గిరిధర్‌రెడ్డి,సురేష్‌రెడ్డి భూపాల్‌రెడ్డి, రస్తాపురం చంద్రు,మంద సోమయ్య,మైనార్టీ నాయకులు ఎండి ఖాజా మొయినుద్దీన్, సొక్కం సోమన్న,సంగి బాలరాజు,ఎల్లారెడ్డి,విక్రమ్‌రెడ్డి,నోముల నర్సయ్య, చరణ్, సారయ్య, అన్వర్‌లతో పాటు సుమారు 1000 మంది యువకులతో పాటు ముఖ్య నాయకులకు ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మేకలు,గొర్రెల పెంపకందార్ల కార్పొరేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హాస్టల్ విద్యార్థి మనోహర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్లో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12వ తరగతి చదువుతున్న దుబాషి మనోహర్ ఆదివారం రోజున హాస్టల్ మిత్రులతో కలిసి హుస్నాబాద్ పరిసర ప్రాంతంలో ఉన్న బావిలోకి ఆటవిడుపుకు ఈతకు వెళ్లడం జరిగింది.ప్రమాదవశాత్తు మనోహర్ కాలుజారి బావిలో పడి మృతి చెందడం జరిగింది. ఈ మృతిపట్ల భువనగిరి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనోహర్ కుటుంబాన్ని ఆదుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించిన హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చెయ్యాలని ప్రభుత్వ హాస్పిటల్ ముందు వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించారు. విద్యార్థి మృతి పట్ల జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జైపాల్‌రెడ్డి నేతృత్వంలో మరణించిన విద్యార్థి తక్షణ సహాయం కింద రూ.50,000 మనోహర్ కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ప్రభుత్వపరంగా వచ్చే ఎక్స్‌గ్రేషియాను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బర్రె జహంగీర్,మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బర్రె జహంగీర్, దళిత బహుజన సీనియర్ నాయకులు బట్టు రామచంద్రయ్య, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుర్వంగ శివలింగం,బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బండార్ రవివర్ధన్ ,యూత్ కాంగ్రెస్ జిల్లా



అధ్యక్షులు బర్రె నరేష్ ,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల రాజు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు ,కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నంపట్ల కృష్ణ, సందెల రాజేష్ ,ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చింతల శివ, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎండి అక్తర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బిసుకుంట్ల సత్యనారాయణ, నాయకులు మహేష్, వెంకటేష్ ,గోనూరు ,సాయి, నివాస్ నేహాల్, బాసాని మహేందర్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి



నవతెలంగాణ-గుండాల

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని సీపీఐ (ఎం) గుండాల మండల కార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు.సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ కు 50 రూపాయలు,మరియు 19 కేజీల కమర్షియల్ సిలిండర్ కు 350 రూపాయలు పెంచింది.ఇంత పెద్ద మొత్తంలో పెరిగిన సిలిండర్ ధరల వల్ల సామాన్యులపై మోయలేని భారం పడుతుందన్నారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు.దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వల్ల సామాన్యులపై భారం పడుతుందన్నారు.పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని ప్రజలపై భారాలు పడకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు పోతరబోయిన సత్యనారాయణ,ఎండి ఖలీల్,మల్లబోయిన బాలయ్య,బత్తిని బిక్షం,పెద్దపడిశాల మాజీ ఉపసర్పంచ్ పోతరబోయిన అంజయ్య,శాఖపురం లింగయ్య,కొలిచెలిమ అబ్బయ్య,గూడెపు వెంకటయ్య,ఆకుల నర్సయ్య,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని వినతి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్టలో పట్టణ బస్టాండ్ యథావిధిగా కొనసాగించాలని కోరుతూ వైటీడీఏ వైస్‌చైర్మెన్ కిషన్‌రావుకు,ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్‌కు,ఎండోమెంట్ అదనపు కమిషనర్ జ్యోతికి వినతిపత్రాలను సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ బస్టాండ్ యథావిధిగా కొనసాగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.పాత హైస్కూల్ స్థలంలో భక్తుల వసతిగధులు వెయ్యి నిర్మాణం చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని,దేవాలయ ఉద్యోగాలలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని, కొండపైకి ఆటోలు నడపడానికి అనుమతించి ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలని, భక్తుల కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్న రిటైర్డ్ అధికారిని అయిన ఈఓ ను తొలగించి ఆలయ ప్రతిష్ఠను పెంచే విధంగా ఐఏఎస్ ఆఫీసర్ నియమించాలని కోరారు.వినతిపత్రం అందజేసిన వారిలో అఖిలపక్ష నాయకులు బబ్బూరి శ్రీధర్, బబ్బూరి పోశెట్టి, కాటబత్తిని ఆంజనేయులు, బండి అనిల్ తదితరులు ఉన్నారు.

మహిళల క్రీడల ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మున్సిపల్ పరిధిలోని ఇండోర్ స్టేడియంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడల ఏర్పాటును, క్రీడా మైదానాన్ని ఆలేరు పురపాలక సంఘం చైర్మెన్ వస్పరి శంకరయ్య, పురపాలక కమిషనర్ ఎ.మారుతీప్రసాద్‌తో కలిసి



పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ మహిళా అధ్యక్షురాలు సిసా మహేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు పూల నాగయ్య, బారాస ఆలేరు పట్టణ ప్రధాన కార్యదర్శిపత్తి వెంకటేష్, నాయకులు ముదిగొండ శ్రీకాంత్, బింగి గణేష్, మహేశ్వరి, ధనలక్ష్మి పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్

నవతెలంగాణ-అడ్డగూడూర్

మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు ఆత్మకూరుఎం మండలకేంద్రంలో నిర్వహించిన కరాటే పోటీలో 54 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు.జేఎస్ గార్డెన్‌లో విక్టరీ చోటు ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2023 కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ అడ్డగూడూరు విద్యార్థినులు 13 మంది గోల్డ్‌మెడల్స్, 17 మంది సిల్వర్ మెడల్స్, 24 మంది బ్రాంచ్ మెడల్స్ సాధించారు.ఈ అవార్డ్స్ సాధించిన



విద్యార్థినులను పాఠశాల ఎస్ఓ జె.సరిత అభినందించారు.

గ్రామకంఠం భూమి స్వాహా

- నిద్ర మత్తులో అధికార యంత్రాంగం
- రెండేండ్లుగా నిరీక్షణ
- 21ఎకరాల భూమికి 18ఎకరాలకే పర్మిషన్
- గ్రామస్తులపై పోలీసుల జులూం

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో సర్వే నెంబర్ 525,526లో స్ఫూర్తి గ్రీన్ నేస్టు ప్రయివేట్ వెంచర్లో గ్రామకంఠానికి చెందిన 30 గుంటల భూమిని ఆక్రమించి గోడ నిర్మాణం చేసుకున్నారు.ఈ విషయాన్ని గ్రామస్తులు సంబంధించిన అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్న పటించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అడిగినందుకు బెదిరింపులు..

గ్రామానికి అనుకొని గతంలో పాత ఊరు ఉన్న 30 గుంటల భూమిని ప్రయివేట్ వెంచర్ నిర్వాహకుడు ఆక్రమించాడు.పది రోజుల కింద గ్రామస్తులు వెంచర్ నిర్వాహకున్ని సంబంధిత విషయంపై అడగగా రెండ్రోజుల్లో వచ్చి గ్రామస్తులతో చర్చించి మాట్లాడతానని హామీ ఇచ్చాడు.పది రోజులు గడిచిపోయినా వెంచర్‌కు రావడానికి మొహం చాటేశాడు.ఈ విషయంపై గ్రామస్తులు ఏకదాటిగా ఒక్కటై వెంచర్ గేట్‌కు తాళవేద్దామని చర్చించుకున్నారు.గేట్ దగ్గరకు వెళ్లి రోడ్డు మీద నిలబడి మాట్లాడుతుండగా వెంచర్‌కు సంబంధించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు పెట్రోలింగ్ వాహనం పై వచ్చి గ్రామస్తులను భయబ్రాంతులకు బయబ్రాంతులకు గురి చేశారు. వెంచర్‌పై ఎందుకు దాడి చేస్తున్నారని పోలీసులు బెదిరించారు.ఈ విషయంపై పోలీసులను గ్రామస్తులు వివరణ అడగగా గ్రామకంట్ల భూమి లేదని వెంచర్ నిర్వాహకుడు చెప్తున్నాడని సమాధానం ఇచ్చాడు.గ్రామస్తులు సర్వే నెంబర్ 525,526 నెంబర్ గల భూమిలో 20ఎకరాల 18గుంత ల భూమి ఉన్నది. అందులో 30 గుంటల భూమిని ఉన్నదని గ్రామస్తులు అధికారులకు 2021 సంవత్సరం నుంచి చెబుతూ వస్తున్నారు. వెంచర్ మొదలు పెట్టిన నుంచి ఇప్పటి వరకు సమాచారం కోసం గ్రామస్తులు మండల, జిల్లా ఉన్నతధికారులకు దరఖాస్తులు ఇచ్చి సమాచారం అడగగా అడిగినప్పుడల్లా రేపు మాపు అంటూ సమయాన్ని గడుపుతున్నారు.గ్రామ సభలో ఈ భూమి పై పలువురు గ్రామస్తులు చర్చించారు.

రెండేండ్లు దాటినా సమాచారమివ్వని అధికారులు

గ్రామానికి సంబందించిన కొందరు గ్రీన్ నేస్ట్ వెంచర్ పై సమాచారం అడగగా 20.26 ఎకరాలకు గాను 18ఎకరాలకు లే అవుట్ చేశారని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నారు.రెండేండ్లు అయినప్పటికీ పట్టించుకోవడం లేదు.ఎంతో సహనంతో గ్రీన్ నేస్టు వెంచర్ నిర్వాహకునికి గ్రామస్తులు సమాచారం కోసం అడగగా గ్రామస్తులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. సర్వేయర్‌ను పిలిచి కొలిపిస్తానని మండల అధికారులు హామీ ఇచ్చారు కానీ సర్వే చేయకుండా సర్వే చేశామంటూ గ్రామస్తులను మోసగిస్తూ అధికార యంత్రాంగం కూడా వెంచర్ నిర్వాహకులకు కొమ్ముగాస్తూ గ్రామస్తులను మోసం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా సుమారు 100మంది గ్రామకంఠం భూమిని ఆక్రమించడానికి మీరేవరని ప్రశ్నించారు.డబ్బు బలంతో పోలీసు యంత్రాంగం దింపి గ్రామస్తులపై జులూం చేశారు. వెంచర్ నిర్వాహకులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని గ్రామకంఠం భూమిని తమకు దక్కేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

14వ తేదీలోపు రికార్డులు అందిస్తా

ఎంపీఓ-సలీం

శర్బనాపురం గ్రామంలో ఓ ప్రైవేటు వెంచర్‌లో 525, 526 సర్వే నెంబర్లలో 30 గుంటల భూమి గ్రామకంఠం ఉందని గ్రామస్తులు ఆరోపించారు.సర్వే చేయించాను ఈనెల 14వ తేదీ వరకు రికార్డ్స్ అందజేస్తాను





తూతూమంత్రంగా భూమి సర్వే

అంగడి భిక్షపతి-గ్రామస్తుడు

అధికారులకు గ్రామంలో 525, 526 సర్వే నెంబర్లు 30 గుంటల గ్రామకంఠం భూమిఉందని చెప్పినప్పటికీ అధికారులు భూమి సర్వే చేస్తామని చెప్పి గ్రామస్తులు లేని సమయంలో భూమి సర్వే చేశారు. సర్వే నెంబర్లు వేయకుండా ఎలా చేస్తారని, అధికారులు వెంచర్ నిర్వాహకులు చెప్పినట్టు వింటున్నారు.



గ్రామానికి గ్రామకంఠం భూమి ఇవ్వాలి

రామ్‌చర్ల నర్సింగరావు- గ్రామస్తుడు

గ్రామంలో ఓ ప్రైవేటు వెంచర్ ప్రారంభించారు.అందులో గ్రామకంఠం భూమి 30 గుంటలు ఉంది. వెంచర్ నిర్వాహకులు 20 ఎకరాల 26 గుంటల భూమి సర్వే చేసి గ్రామకంఠం 30 గుంటలు ఉంటుంది.దానిని గ్రామపంచాయతీకి ఇవ్వాలి



ఈ నెల 9న హత్ సే హత్ జోడో యాత్ర

నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని అల్వాల్‌పురం గ్రామం నుండి ఈ నెల 9న హత్ సే హత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హత్ సే హత్ జోడో యాత్ర కరపత్రాలను గ్రామంలో ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహించామని, ఈనెల 9వ తేదీ న ఉదయం 8 గంటలకు అల్వాలపురం గ్రామం నుండి హత్ సే హత్ జోడి యాత్ర మండలంలో ప్రారంభం అవుతుంది అని, 10 గంటలకి ద్వారకుంట, 12 గంటలకి నల్లబండగూడెం, సాయంత్రం చిమిరియాల, మంగళ్ తండ గ్రామాలలో హత్ సే హత్ జోడో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముందుగా హత్ సే హత్ జోడో యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు రఫీ యుద్దీన్, గుడిబండ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు రఫీ, రామకృష్ణ, రాజారావు, సైదులు, జానీమియా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ కంకణ అవార్డు నాట్యగురువు తిరుపతి స్వామి

నవతెలంగాణ-కోదాడరూరల్

హైదరాబాద్‌లోని హరి హర కళాభవన్‌లో సినీ హీరో సుమన్, హీరో సాయి కిరణ్ రుద్రాక్ష వైభవం ఉగాది మహోత్సవ సువర్ణ కంకణ అవార్డుల కార్యక్రమంలో చాముండేశ్వర మహర్షి చేతుల మీదగా పట్టణవాసి తిరుపతి స్వామి అవార్డును సోమవారం అందుకున్నారు. అదేవిధంగా వీరి శిష్యబృందం ప్రదర్శించన నృత్య ప్రదర్శన అందరిని బాగా ఆకట్టుకుంది. ప్రదర్శన చేసిన చిన్నారులు అక్షయ, సాన్విక, లౌక్య, కుసుమ, జాహ్నవి, మోక్షత లకు ధ్రువపత్రాలు షీల్డ్ అందించారు. ఈ అవార్డు రావడం పట్టణానికి ఎంతో గర్వకారణమని, అదేవిధంగా చిన్నారుల ప్రదర్శన చెయ్యడం వారి చేతుల మీదగా మెమోంటోస్ అందుకోవడం ఎంతో సంతోశంగా ఉందని వారు ఆనందాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లి తండ్రులు కరుణకుమార్, శిరీష, శ్రీధర్ , రేవతి , కిరణ్మయి, నాగేశ్వరావు బిందు తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

పెన్‌పహాడ్: మండల పరిధిలోని దుపహడ్, ఎన్న అన్నారం ఎస్సీ కాలనీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యా యులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారన్నారు. ప్రధానోపాధ్యాయులుగా జ్యోస్న, గోపీచంద్, ఎంఈఓగా యశ్వంత్, రుత్విక్ రాజ్ ఉపాధ్యాయులుగా మను, యామిని, శివతేజ, హర్షప్రియ, మైథిలి బాధ్యతలు నిర్వర్తించినట్టు చెప్పారు. ప్రాథమిక పాఠశాలలు కావడంతో చిన్న చిన్న పిల్లల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఎస్ఎంసీ చైర్మెన్ గుగ్గిళ్ళ శాంసన్, సరళ కుమారి, ఉపాధ్యాయులు రాజశేఖర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకుందాం

ఆత్మకూరుఎస్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల ఐక్యతకు మైలురాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో కెసిఆర్ ద్రోహపూరిత, అవినీతి నియంతృత్వ పాలనపై మరోపోరాటం చేసి తెలంగాణ ను కాపాడుకుందాం అని తెలంగాణ జనసమితి యూత్ మండలఅధ్యక్షుడు యాకూబ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మార్చి 10న హైదరాబాద్‌లో తెలంగాణ జనసమితి నిర్వహించే తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, వెంకన్న, బంటు అజయ్, మధు, జానీ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ జన్మదిన వేడుకలు

తుంగతుర్తి: మండలకేంద్రంలోని గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గోపగాని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసి మిఠాయి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ వైస్‌చైర్మెన్ కోదాటి సుధాకర్‌రావు, డైరెక్టర్లు మొగలగాని వంశీగౌడ్, ఉప్పుల నాగమల్లు, బొంకురి శ్యాంసుందర్, గోపగాని వెంకన్న గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, సైదులు, రాంబాబు, ఎల్లయ్య, అనిల్, శ్రీను, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు



- సంజీవిని ఆస్పత్రిని సీజ్ చేసిన డీఎంహెచ్ఎం కోటాచలం

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

గర్భస్థ లింగ నిర్ధారణ,గర్భస్రావం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. సోమవారం జిల్లాకేంద్రంలో ని 45 వార్డులోని సంజీవిని హాస్పిటల్‌లో అబార్షన్లు చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు చేసి సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదురోజుల కింద వాడ్తియ జ్యోతి,భర్త భూక్య రమేష్ నూతనకల్ మండలం, దిర్షణపల్లికి చెందిన ఈమెకు మొదటి సంతానం ఒక కూతురు ఉండగా, రెండో సంతానం కోసం ఆరు నెలల గర్భవతి అని హాస్పిటల్లో అడ్మిట్ చేసుకొని గర్భస్రావం చేశారన్నారు. వేరొక మహిళ యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలం,గ్రామం గట్టుసింగారానికి చెందిన మాద దుర్గా భర్త శ్రీనివాస్ ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భవతి అబార్షన్ చేయడానికి సిద్ధంగా ఉండడంతో ఆమెకు గ్లూకోజ్ ఉండడంతో అనుమానం వచ్చి అడగగా అబార్షన్ కోసం వచ్చానని చెప్పిందన్నారు. గర్భస్రావం, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి రిజిస్ట్రేషన్ రద్దుతో పాటు, చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అబార్షన్ చేసిన అమ్మాయికి ఆరోగ్యం పరీక్షల నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అధికారి డాక్టర్ అంజయ్య, ఎస్. ఓ వీరయ్య, డీఐఓ డాక్టర్ వెంకటరమణ, నూతనకల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-తుంగతుర్తి

తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ సహకారంతో గ్రామాలలో అనేక రకాలుగా అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్ అబ్బగాని పద్మ నారాయణగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంపటి 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కలిసి స్థానిక సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ గౌడ్‌తో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు అనేక రకాలైన అభివృద్ధి పనులను చేపడుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండగాని వీరస్వామి, ఉపసర్పంచ్ భాషబోయిన వెంకన్న,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య, ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు కొండగడుపుల నాగయ్య, తునికి సాయిలు, తునికి లక్ష్మమ్మ, చెరుకు పరమేష్, వార్డు సభ్యులు చంటి అంజయ్య, చిటిపాక శ్రీనివాస్, రచ్చ నవీన్, జెక్కి సతీష్, గ్రామ పెద్దలు, గుండగాని అంజయ్య పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

నవతెలంగాణ-ఆలేరురూరల్



18 ఏండ్లు దాటిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని పల్లె దవాఖాన డాక్టర్ సుప్రియ అన్నారు. సోమవారం మండలం లోని కొల్లూరు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంలో వారు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ 82 మందికి కంటి పరీక్షలు చేయించు కున్నారన్నారు. ఈ అవకాశాన్ని మిగతావారు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జయమ్మ విజయ,ఆశా వర్కర్ లక్ష్మి, సిబ్బంది మధు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకు అవకాశమివ్వండి

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఉమ్మడి మహబూబనగర్‌గర్,రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రశ్నించే గొంతుక అయిన విద్యావంతుడు ఏవీఎన్.రెడ్డికి అవకాశం ఇవ్వాల్సిందిగా వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ సంఘం టీపీయూఎస్ ప్రధాన కార్యదర్శి తేలికలపల్లి పెంటయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ప్రచారానికి సంబంధించిన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిలుక శ్రీనివాస్,జిల్లా అధ్యక్షురాలు ఉమా, ప్రధానకార్యదర్శి భాస్కర్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి దూడల వెంకటేష్, మండల అధ్యక్షులు వెంకటరెడ్డి ,ప్రధాన కార్యదర్శి మధు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రాజపేట

ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ రాపోలు లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని పారుపల్లి గ్రామంలో తన స్వగృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నాగిర్తి రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏడ్లరామచంద్రారెడ్డి,రాపోలు తిరుపతిరెడ్డి, కాలే నరసింహులు, శీతాలవీరయ్య, ఆర్.బాలరాజు,జానకిరాములు,మోత్కుపల్లి నవీన్, రవి, సత్యం, కిషన్, మైపాల్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ అందజేత

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రహేమున్నిసా ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ జ్ఞాన సుందర్ సోమవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి,ప్యాడ్స్ పంపిణీ చేశారు. అదే క్రమంలో భారత రాజ్యాంగం, తెలంగాణ రైతు చట్టం యొక్క కూడా ప్రధానోపాధ్యాయురాలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, దామర్ల పిచ్చయ్య ,గంగాధరి, శ్రీధర్,శ్రీను,వంశీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆలేరు నాయకులు

నవతెలంగాణ-ఆలేరురూరల్

గుండాల మండలంలో జరిగే బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆలేరు మండల నాయకులు సోమవారం బయల్దేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్,వైస్‌ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, జిల్లా నాయకులు కందుల రామన్, మండల యువజన విభాగం అధ్యక్షులు ఐలి కృష్ణ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు మామిడాల భానుచందర్ ,నాయకులు కిష్టయ్య ,దశరథ, రామకృష్ణ ,మహేందర్ ,చంద్రయ్య ,నరసయ్య, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-అడ్డగూడూరు

విద్యార్థులు సమాజంలో మంచి ప్రవర్తనతో ఎదిగినప్పుడే గురువులు ఆనందిస్తారని గురువులు అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 1990-91బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆనాటి గురువులను సన్మానించారు. 32 ఏండ్ల తర్వాత అందరూ కలుసుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గురువులు సంగెం నర్సింహారెడ్డి, సుందర్ దీక్షిత్, జి.జగన్నాధ చారి,పి.కనకయ్య, వి.జనార్ధనాచారి, గురుమూర్తి,వి.రాంరెడ్డి, కె.యాదగిరి, బి.రాంరెడ్డి,స్వీపర్ ఎన్.బుచ్చమ్మ ,90-91 బ్యాచ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మండల దీక్ష

రాజపేట : మండలంలోని రఘునాధపురం గ్రామాన్ని మండలం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వెంటనే గెజిట్‌ను విడుదల చేయాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 209వ రోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ బల్లకౌసల్య బింగిసత్యనారాయణ, శ్యామలాభాస్కర్, బొద్దులవెంకటేశం, కటకంశివ, కటకంనగేష్, గోట్టిపాములశ్రీనివాస్, గోళికిరన్ , గుర్రంసిద్దిరాములు, బొమ్మనరేష్, లెల్లెపటిపాపిరెడ్డి లెల్లపాటినర్సిరెడ్డి మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్, ఎంపీటీసీ బుడిగె రేణుక పెంటయ్యగౌడ్, ఉపసర్పంచ్ ప్రవీణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగికదాడులను అరికట్టాలని కోరుతూ దీక్ష

ఆలేరుటౌన్: మహిళలపై లైంగికదాడులను నిరోధించాలని కోరుతూ హైదరాబాద్,నాంపల్లి వద్ద సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్ హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్, విజయశాంతి, అరవింద్ మీనన్, నల్లు ఇంద్రసేనారెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, తుల ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కేతమ్మల వివాహ మహోత్సవం

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని సోలిపేట గ్రామంలో సోమవారం రోజున భ్రమరాంబ మల్లికార్జున స్వామి కేతమ్మల వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు బండ్లు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం వేమూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ చీర్ల రాజేశ్వరియాదవ్, గూడా సింహారెడ్డి, సోలిపేట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ల రవీందర్‌రెడ్డి,చీర్ల శ్రీశైలం యాదవ్, చీర్ల రవీందర్‌యాదవ్, వార్డ్ సభ్యులు చీర్ల రాజు యాదవ్, జూపల్లి సురేష్,ప్రవీణ్‌యాదవ్, గుళ్లనిఉపేందర్, చంద్రశేఖర్ యాదవ్, కొక్కొండ శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌యాదవ్, మహేష్, బాబు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి 11 వరకు మిషన్ భగీరథ మంచినీటి సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చే గోదావరి నీరు హైదరాబాద్ మెట్రో బోర్డుపైపులైన్ల మరమ్మతు పనుల నిమిత్తం 4 రోజులు మార్చి 8 తేదీ నుంచి 11వ తేదీ వరకు మిషన్ భగీరథ మంచి నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని కార్య నిర్వాహక ఇంజనీర్, డి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మెట్రో బోర్డు మరమ్మత్తు పనుల నిమిత్తం నీటి సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు గమనించాలని తెలియజేశారు. జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, ఆలేరు, గుండాల, బీబీనగర్, వలిగొండ, భువనగిరి, ఆత్మకూరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, రామన్నపేట(8) మండలాల పరిదిలోని ఆవాసాలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-భువనగిరి రూరల్

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్ తివారీ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఆయన ప్రజల నుండి 31 దరఖాస్తులను స్వీకరించారు.రెవెన్యూ శాఖ 25, వ్యవసాయ శాఖ 2, గ్రామీణాభివృద్ధి 2, మున్సిపాలిటీ, మెడికల్ శాఖలు ఒక్కొక్కటి ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎం.నాగేశ్వరాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు

నవతెలంగాణ-భువనగిరిరూరల్

ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు జరిగిన క్రీడా పోటీలలో భాగంగా చెస్ పోటీలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు.అనంతరం టెన్నికాయట్ గేమ్ ప్రారంభించి కొద్దిసేపు ఆడారు. అనంతరం ఫన్ గేమ్స్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ చాలా మంది మహిళా ఉద్యోగులు ఉత్సాహంతో పాల్గొనడం సంతోషించదగిన విషయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని కొద్దిసేపు టెన్ని కాయట్, షటిల్ గేమ్ ఆడారు. క్రీడా పోటీలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి పరిమళాదేవి, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ సబిత, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు మందడి ఉపేందర్‌రెడ్డి,జిల్లా యువజన అధికారి ధనాంజనేయులు, ఎస్జిఎఫ్ సెక్రటరీ స్టాలిన్ బాబు, ఏ దశరథ రెడ్డి ప్రధానోపాధ్యాయులు, ప్రభాకర్‌రెడ్డి, పీఈటీలు నాతి కృష్ణమూర్తి రఘువీర్సింగ్,కె.గోపాల్, బాలకృష్ణ, సుజాత, ఉపేంద్ర, కవిత, ఇంద్ర ప్రియ, కవిత, క్రీడాపోటీలలో సుమారు 150 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

వతెలంగాణ-ఆత్మకూర్‌ఎం

మండలకేంద్రంలోని ముదిరాజ్ కులదవమైన పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.1,00,116 టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య సోమవారం మండలకేంద్రంలోని ముదిరాజ్ సంఘం నాయకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్, సర్పంచ్ జె.నగేష్ ఉపసర్పంచ్ దొంతర బోయినవ్య భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎద్దు వెంకటేశ్వర్లు, నాయకులు మల్లేశం, రాములు, భాస్కర్, నరేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ముడుపుల బాగోతం

- ఇంటి రిజిస్ట్రేషన్ కు రూ.20 వేలు లంచం అడిగారని సబ్ రిజిస్ట్రార్ పై ఆరోపణలు
- లంచం డిమాండ్ పై సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్ మధ్య గొడవ
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- సబ్ రిజిస్ట్రార్ లంచాలకు నిరసనగా 3 రోజులు డాక్యుమెంట్ రైటర్ల షాపులు బంద్

నవతెలంగాణ-మోత్కూరు

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల గోల పరాకాష్టకు చేరింది.లంచం ఇవ్వనిదే ఏ రిజిస్ట్రేషన్ చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా స్థలాన్ని గాని, ఆస్తిని గాని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రభుత్వానికి చెల్లించే డబ్బు కన్నా రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్‌కే అంత కన్నా ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు.అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా...ఏ చిన్నపాటి అక్షర దోషం ఉన్నా తక్కువలో తక్కువ రూ.20 వేలు ఇవ్వనిదే సంతకాలు చేయడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.తాజాగా తండ్రి పేరున ఉన్న ఇండ్లు కొడుకు పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి చెందిన నారబోయిన వెంకటేష్ తండ్రి పేరున ఉన్న ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సోమవారం మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ కు సంబంధించిన పత్రాలన్నీ సిద్ధం చేసుకుని డాక్యుమెంట్ రైటర్ కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డిని తీసుకుని సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ వద్దకు వెళ్లారు.అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా రిజిస్ట్రేషన్ చేసేందుకు రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ రూ.20 వేలు లంచం అడగడంతో తాము అంత ఇచ్చుకోలేమని, రిజిస్ట్రేషన్ కోసమే అప్పు చేయాల్సి వచ్చిందని, రూ.5 వేలు ఇస్తామని డాక్యుమెంట్ రైటర్‌తో చెప్పి పంపారు. అదే విషయం రిజిస్ట్రార్‌కు చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారితో మాట్లాడుతుంటే మధ్యలో వచ్చి మాట్లాడడానికి నీవెవ్వరని, రిజిస్ట్రేషన్ నీది కాదుగా నీకేం సంబంధమంటూ సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ రైటర్ క్రాంతికుమార్‌రెడ్డిని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో తన



కార్యాలయంలోకి వచ్చి తనను దూషించారని సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ డాక్యుమెంట్ రైటర్ క్రాంతికుమార్‌రెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు మోత్కూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఇంటి రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ బాధితుల నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారని, వారు నిరుపేదలని అంత మొత్తంలో లంచం ఇవ్వలేరని ఇంటి రిజిస్ట్రేషన్ చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరడానికి వెళితే తనతో గొడవ పడ్డారని డాక్యుమెంట్ రైటర్ క్రాంతికుమార్‌రెడ్డి విలేకర్లకు తెలిపారు.లంచం పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఎస్ఐ సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్‌ను, డాక్యుమెంట్ రైటర్ క్రాంతికుమార్‌రెడ్డిని కూర్చోబెట్టి మాట్లాడినట్టు తెలిసింది. స్టేషన్ నుంచి సబ్ రిజిస్ట్రార్ సురేంద్‌నాయక్ కార్యాలయానికి వెళ్లగా నవ తెలంగాణ రిపోర్టర్ కార్యాలయంలోకి రావడాన్ని గమనించి బాధితుడిని పిలిపించి వెంటనే ఇంటి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు 'నవ తెలంగాణ'తో మాట్లాడుతూ ఇంటి రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రార్ రూ.20 వేలు లంచం అడిగారని, తాము పేదవారమని అంత ఇవ్వలేమని రూ.5 వేలు ఇస్తామని చెప్పామని, అదే విషయం డాక్యుమెంట్ రైటర్‌తో చెప్పి పంపితే సబ్ రిజిస్ట్రార్ ఆయనతో గొడవ పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారని తెలిపారు.

ప్రయివేట్ వ్యక్తిని పెట్టుకుని లంచాలు వసూలు

తాజా లంచం పంచాయితీతో కార్యాలయంలో ఓ ప్రయివేట్ వ్యక్తి వ్యవహారం వెలుగులోకి వచ్చింది.వలిగొండ మండలం దుప్పెల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన కుమారస్వామి కార్యాలయంలో తిష్ట వేసి అధికారులు చెప్పినట్టు లంచాలు వసూలు చేస్తారంటున్నారు. కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్లు ఇర్షాద్, హైందవి, సుధీర్, అటెండర్ రాజేశ్వరి మాత్రమే పని చేస్తున్నారు.కార్యాలయానికి సంబంధం లేని ఆ ప్రైవేట్ వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు ఏడెనిమిదేండ్లుగా పని చేస్తున్నారని, రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఫొటోలు తీసే సెక్షన్‌లో అతనే కంప్యూటర్ వద్ద ఉండి ఫొటోలు తీస్తారని, ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ కూడా ఈ వ్యక్తినే అడ్డం పెట్టుకునే లంచాలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.నవ తెలంగాణ రిపోర్టర్ కార్యాలయంలో కూర్చున్న ప్రైవేట్ వ్యక్తి కుమారస్వామిని ఫొటోలు తీస్తుండగా నన్నెందుకు ఫొటోలు తీస్తున్నావని, నేను రిజిస్ట్రేషన్ కోసం వచ్చానంటూ కార్యాలయం నుంచి బయటకు జారుకున్నారు.దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుతున్నది.

సబ్ రిజిస్ట్రార్ లంచాలకు నిరసనగా 3 రోజులు డాక్యుమెంట్ రైటర్ల షాపులు బంద్

సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ లంచాల వసూలును తట్టుకోలేక డాక్యుమెంట్ రైటర్లు మూడు రోజులు బంద్ పాటించాలని నిర్ణయించుకున్నారు.సబ్ రిజిస్ట్రార్ ఇక్కడకు వచ్చి ఆరు నెలలవుతుందని, రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ అడ్డగోలుగా లంచాలు వసూలు చేస్తున్నారని, రిజిస్ట్రార్ లంచాలతో తాము కూడా బద్నాం కావడంతో పాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ సబ్రిజిస్ట్రార్ లంచాల వసూలుకు నిరసనగా డాక్యుమెంట్ రైటర్లు ఈనెల 8, 9, 10 తేదీల్లో షాపులు మూసివేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.మోత్కూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై జిల్లా రిజిస్ట్రార్ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

తాను ఎవర్ని లంచం అడగలేదు
సురేందర్ నాయక్, సబ్ రిజిస్ట్రార్, మోత్కూరు

ఇంటి రిజిస్ట్రేషన్ కోసం తాను ఎవర్ని లంచం అడగలేదు. ఇంటి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని ఆ డాక్యుమెంట్ తో ఎలాంటి సంబంధం లేని ఓ వ్యక్తి వచ్చి తనతో గొడవ పడి కులం పేరుతో దూషించారు. తనపై దాడికి యత్నించారు. డాక్యుమెంట్‌కు సంబంధించిన వ్యక్తులను రమ్మంటే వారు రాకపోవడంతో తాను రిజిస్ట్రేషన్ చేయలేదు. దాంతోనే తాను డబ్బులు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు చేస్తున్నారు. కార్యాలయంలో పని చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి కుమార స్వామితో తమకు సంబంధం లేదు.అతనెవరో తనకు తెలియదు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం ఎవరెవరో వస్తుంటారు.అతను కూడా రిజిస్ట్రేషన్ కోసం వచ్చాడేమో. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరు పని చేస్తున్నారో మీరు చూడరా అని ప్రశ్నించగా తన పని తాను చేసుకుని వెళ్లిపోతున్నానని, ఎవరేం చేస్తున్నారనేది తనకేం సంబంధమని చెప్పారు.



పంచాయతీ కార్యదర్శులను నియమించాలి

నవతెలంగాణ-వలిగొండ

మండల కేంద్రంలో స్థానిక మేజర్ గ్రామపంచాయతీలో శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గర్దాస్ నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నాలుగు నెలల కింద పంచాయతీ కార్యదర్శి బ్రహ్మచారి అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన విషయం తెలిసిందేన్నారు. అప్పటినుండి రెడ్ల రేపాక గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఆ పంచాయతీ కార్యదర్శి మొదటగా రెడ్లరేపాక గ్రామపంచాయతీ పనులు ముగించుకుని వలిగొండకు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత రావడంతో స్థానిక ప్రజలకు అనేక పనుల నిమిత్తం వేచి చూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.అంతకుముందు ఉన్న క్లర్క్‌ను జిల్లా అధికారులు ఇతర గ్రామపంచాయతీకి పంపించారన్నారు.శాశ్వత పంచాయతీ కార్యదర్శి, క్లర్క్ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్టు తెలిపారు. కలెక్టర్ స్పందించి శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు.

మహిళా దినోత్సవ వేడుకలకు ఎంపీ సంతోష్ రాక

ఆలేరుటౌన్ : ఆలేరు నియోజకవర్గకేంద్రంలో ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు ఇండోర్ స్టేడియంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ ముఖ్యఅతిథిగా రానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు..హీల్ స్వచ్ఛంద సంస్థ, మాగ్నిస్ డయాగ్నొస్టిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం,ఎంపీ సంతోష్ పిలుపు మేరకు భారీ సంఖ్యలో మొక్కలు నాటడం,సాంస్కృతిక కార్యక్రమాలు, గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానోత్సవంతో పాటు మహిళలతో సమావేశం నిర్వహించబడుతుందన్నారు.

పైరవీలకు తావు లేకుండా నష్టపరిహారం చెల్లించాలి


నవతెలంగాణ-భువనగిరిరూరల్

మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో భూ నిర్వాసితులకు బస్వాపురం రిజర్వాయర్ లో ముంపుకు గురవుతున్న వారికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా చూడాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు, ఆర్డీఓకు, కాలేశ్వరం ప్రాజెక్టు ఈఈకు, ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మెన్ ఎడ్ల సత్తిరెడ్డిలు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామస్తులకు రూ.47 కోట్ల చెల్లింపు విషయంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా న్యాయబద్ధంగా, సీరియల్ ప్రకారం భూములకు నష్టపరిహారం రైతులకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వల్లందాస్ పరమేష్, తిమ్మాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు 50 ఏండ్లకే పింఛన్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎం

కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీబ్రాహ్మణులకు 50 ఏండ్లకే పింఛన్లు ఇవ్వాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని ఎమ్మెస్సార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాయీబ్రాహ్మణుల మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.నాయీబ్రాహ్మణులకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. మండలంలోని నాయీ బ్రాహ్మణులకు సేవింగ్ కటింగ్ కిట్లను ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్ ,సర్పంచ్ జన్నాయి కోడే నగేష్, ఉపసర్పంచ్ దంతరబోయిన నవ్యభాస్కర్, కాంగ్రెస్ మండలఅధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్యగౌడ్, నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు శ్రీహరి, నాయకులు పరకాల అంజయ్య, నోముల వెంకట్‌రెడ్డి, భాషబోయిన పాపయ్య, భిక్షం, సత్తయ్య, రవి, బలరాం పాల్గొన్నారు.



మత సామరస్యానికి ప్రతీక సాగరమాత

- నేటి నుండి మూడు రోజుల పాటు కొనసాగనున్న సాగరమాత జాతర
- రెండు తెలుగు రాష్ట్రాలనుండే కాక దేశం నలువైపులా నుండి లక్షల్లో భక్తులు రాక

నవతెలంగాణ-నాగార్జునసాగర్

సర్వ మతాల సంగమంగా, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతున్న సాగర్ మాతా మహెూత్సవాలను నేటి నుండి మూడు రోజుల పాటు జరనున్నాయి.నాగార్జునసాగర్ రైట్ బ్యాంక్ లో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర్ మాత దేవాలయానికి రాష్ట్రంలో ప్రత్యేకస్థానం ఉంది. కోరికలు తీర్చే తల్లిగా సాగర్ మాతను భక్తులు కొలుస్తారు. సాగర్ ఒడ్డున వెలిసిన మేరీమాతను సాగర్ మాత పేరుతో క్రైస్తవులతో పాటు హిందు - ముస్లిం మతాల వారి నీరాజనాలు సైతం అందుకుంటుంది.దేశములోనే భారతీయ సంప్రదాయ రీతులతో నిర్మించిన తొలి క్రైస్తవమందిరంగా దీన్ని చెబుతారు. ధూప , దీప, నైవేధ్యాలు , కొబ్బరికాయలు కొట్టడం, అగర్ బత్తీలు వెలిగించడం, హారతి తలనీలాలు సమర్పించటం వంటి మొక్కులు చెల్లించుకొనే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందు పద్దతిలో జరిగే క్రైస్తవ ఆలయమిది.భారతీయ సంప్రదాయలకు అనుగుణంగా మందిర నిర్మాణం, గోపురం పై విగ్రహ సంపద రూపదిద్దికున్నాయి.మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో విచారణ గురువుగా పనిచేసిన మొదటి సైమన్ స్వామి ఈ దేవాలయం నిర్మాణానికి నడుంకట్టగా గుంటురు క్రైస్తవ పీఠాధిపతి బాలసౌరి అన్ని విధాల సహకరించారు .1976 ఫిబ్రవరి 10 వ తేదిన మందిర నిర్మాణానికి శంకుస్థాపన జరుగగా, ఆ తరువాత సంభవించిన వరదలు, కరువు కాటకాల వల్ల మందిర నిర్మాణం ఆగింది. తరువాత సైమన్ స్వామి రెంటచింతల అడవి సంపద నుంచి ధన సహాయం పొంది సాగరమాత ఆలయం నిర్మాణం పూర్తి చేసారు . ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాగరమాత పుణ్యక్షేత్రంలో విచారణ గురువుగా ఉన్న కే.సుందరరాజు, గుంటూరు క్రైస్తవ పీఠాధిపతి బిషప్ గాలిబాలి సహకారంతో పాత మందిరానికి కుడివైపున చర్చినిర్మాణం చేపట్టారు. నూతన చర్చి నిర్మాణానికి 1994 మార్చి 31వ తేదిన శంకుస్థాపన జరుగగా, 1996 మార్చి 9 వ తేదిన బిషప్ గాలిబాలి చేతుల మీదగా ప్రారంభం అయింది. పాత మందిరం హిందు సంప్రదాయరీతిలో అలరారుచుండగా అందుకు భిన్నంగా నూతన చర్చినిర్మాణం పూర్తిగా క్రైస్తవ పద్దతిలో జరిగింది.సాగరమాత మహెూత్సవం కు ఆలయం ముస్తాబైంది.ఈ సాగర్ మాతా మహెూత్సవాలకు సుమారు 2 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా.దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ను ఏర్పాటు చేశారు.రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం మొత్తం అందంగా ముస్తాబయింది.



ముమ్మరంగా సాగరమాత తిరునాళ్ళు ఏర్పాట్లు
జోసెఫ్ బాలసాగరమ (ఫాదర్)



మూడు రోజులపాటు జరిగే సాగరమాత జాతర ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి కాకుండా దేశ విదేశాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నాం. సాగర మాత మహోత్సవానికి వచ్చే భక్తులకు తాగునీరు మెడికల్ సదుపాయం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ప్రత్యేక టెంట్లను ఏర్పాటు చేశాము.

ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-మునుగోడు

ఇంటి స్థలం లేక కిరాయి ఇండ్లల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు మండల కేంద్రంలో ఎంతోమంది నిరుపేదలు ఇంటి స్థలం లేక కిరాయి ఇండ్లలో వేలకు వేలు కిరాయిలు కట్టలేక అవస్థలు పడుతూ కిరాయి ఇండ్లలోనే కొన్ని సంవత్సరాలుగా జీవిస్తున్నారని తెలిపారు. ఇంటి యజమానులు కిరాయి ఉండే వారిలో ఎవరైనా మృతిచెందినట్లయితే ఇంటి యజమానులు ఎలాంటి మానవత్వం లేకుండా మృతి దేహాన్ని ఇంటిలో ఉంచకుండా ఆరుబయట వేసే పరిస్థితుల్లో గత్యంతరం లేక రోడ్డుపై టెంటు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించుకునే పరిస్థితి దాపరించిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా పేద ప్రజలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

డిప్యూటీ శాసనమండలి చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-మునుగోడు



ఇటీవల డిప్యూటీ శాసనమండల చైర్మెన్‌గా నియమితులైన బండ ప్రకాష్ ముదిరాజ్‌ను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ హైదరాబాదులోని శాసనమండలిలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు డిప్యూటీ శాసనమండలి చైర్మెన్ పదవి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగిలి నాగరాజ్, శిర్గమల్ల కిషోర్, బండారు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన హాలియ విద్యార్థులు

నవతెలంగాణ-హాలియా

ఈ నెల 5న యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్‌లో జరిగిన సుమన్ శోటోఖాన్ కరాటే అకాడమీ అధ్వర్యంలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హాలీయ పట్టణ కేంద్రంలోని ఆకాంక్ష పాఠశాల క్రిష్ణావేని పాఠశాలకు చెందిన సుమారు 17 మంది విద్యార్థులు తమ ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. కటాస్ విభాగంలో గీతాంజలి, తరుణి, నాగచైతన్య, షణ్ముక్, కార్తిక్ గోల్డ్ మెడల్స్ సాధించారు. గౌతమ్, ప్రణతి, భువన, ప్రవీణ్, నజిం, బాబా, సాత్విక్ సిల్వర్ మెడల్స్ సాధించారు. దీక్షిత, గాయత్రి, అర్జున్, రేషిత, నవతేజ్, నందన్ వర్మలు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు సినీ నటులు దిల్ రమేష్ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్‌లు అందజేసి అబినంధించారు. జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్, ఆకాంక్ష పాఠశాల ప్రిన్సిపాల్ మొదాల రవీందర్, క్రిష్ణ వేణి పాఠశాల డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, సతీష్ రెడ్డీ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కంటి వెలుగు పథకం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మునుగోడు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చూడాలని గొప్ప లక్ష్యంతో ఏర్పాటుచేసిన కంటి వెలుగు పథకంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ కోరారు. సోమవారం మండలంలోని చల్మెడ గ్రామంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుమలత, గ్రామ సర్పంచ్ కర్నాటి మహేశ్వరి ఊసయ్య, మాజీ ఉపసర్పంచ్ పగిళ్ల సతీష్, పగిళ్ల శ్రీరాములు, బీ. లాలు, వార్డు నెంబర్లు మద్ది శంకర్, గాదెపాక సుధాకర్, వనం అశోక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో మహిళా సాధికారత

నవతెలంగాణ-చింతపల్లి

మహిళా సంక్షేమానికి పాటుపడిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్‌లో అంగన్వాడీ చింతపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడ కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారిపైనైన కఠిన చర్యలు తీసుకునేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, చింతపల్లి జడ్పీటీసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి, ఎంపీపీ కొండూరు భవాని పవన్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు కుంభం శ్వేత శ్రీశైలంగౌడ్, చెట్టిపల్లి కిష్టమ్మ రాములు, గొడుకొండ్ల సర్పంచ్ కొండూరు శ్రీదేవి శ్రీనివాస్, సిడిపిఓ లావణ్య కుమారి, ఎంపీడీఓ రాజు, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

నల్లగొండ కలెక్టరేట్ : డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నల్లగొండ పట్టణ శాఖ అధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీదర్ రెడ్డీ మాట్లాడారు. బీఆర్ ఎస్ పార్టీ నాయకులకే ఇండ్లు మంజూరు చేయించుకొని, నిరుపేద లబ్ధిదారులకు అన్యాయం చేశారని ఆవేదన చెందారు. పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఇప్పటికైనా నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాదగొని శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్,మోరిషెట్టి నాగేశ్వర్ రావు, వీరెల్లి చంద్రశేఖర్,కర్నాటి సురేష్ కుమార్,నాగం వర్షిత్ రెడ్డీ,కన్మంతా రెడ్డీ శ్రీదేవి రెడ్డీ, తదితరులు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ధర్నా

నవతెలంగాణ-దేవరకొండ



పట్టణములోని పేద ప్రజలకు అందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ముందు, స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. గత నాలుగు రోజుల క్రితం లాటరీ పద్ధతిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు ఇండ్లు ఉన్న వారికే వచ్చాయని ఆరోపిస్తూ ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఇండ్లు ఉన్నవారికి ఇల్లు వచ్చాయని వాటిపైన విచారణ చేపట్టాలని 20-30 ఏండ్ల నుంచి తాము గుడిసెల్లోనే ఉంటున్నామని, పట్టణంలోని ఆరో వార్డు చెందిన మహిళలు ఆర్డీవో కార్యాలయం ముందు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుంటే తీసివేస్తారు..మరి డబల్ బెడ్ రూమ్ ఇల్లేమో ఇవ్వరా అని మహిళలు అధికారులను విమర్శించారు. ఆర్డీవో లేకపోవడంతో అక్కడే కొద్దిసేపు ధర్నా చేపట్టారు. దీంతో దేవరకొండ ఎస్సైలు బాలకృష్ణ ,సతీష్, ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకొని నచ్చజెప్పి పంపారు. ర్యాలీగా వెళ్తూ స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, ఇల్లున్న వారికే ఇల్లు వచ్చిన వాటిపై విచారణ చేపట్టాలని, ఎమ్మెల్యే వచ్చి తమకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ రహదారిపై ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయింది. డిండి సీఐ పరుశరామ్, బాలకృష్ణ, సతీష్‌లు ఎమ్మార్వో రాజును పిలిపించి సమాధానం చెప్పించారు. ఇల్లు ఉండి డబల్ బెడ్ రూమ్ మంజూరైనట్ల అయితే ఫిర్యాదు చేయాలని, వాటిపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఇల్లు రాని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తహసీల్దారు సూచించారు. దీంతో ధర్నా విరమించుకున్నారు.


బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులుగా రమేష్‌నాయక్

నవతెలంగాణ-దేవరకొండ

బీఎస్పీ దేవరకొండ అసెంబ్లీ అధ్యక్షులుగా రమావత్ రమేష్ నాయక్‌ను నియమించారు. సోమవారం జిల్లాలో జరిగిన బహుజన సమాజ్ పార్టీ జిల్లా సమీక్ష సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తనను నియమించినట్లు రమేష్ నాయక్ తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత రెండు సంవత్సరాలుగా అసెంబ్లీ ఇన్చార్జి పనిచేసిన తనపై నమ్మకాన్ని ఉంచి మళ్ళీ నియమించారని ఆయన తెలిపారు. పార్టీ గెలుపే లక్ష్యంగా కమిటీలను వేస్తానని అన్నారు.

కాయిన్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నిడమనూరు



ప్రజలు కాయిన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ జయరాజ్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ముకుందాపురం గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంక్ అధ్వర్యంలో కాయిన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీఐ నిబందల మేరకు కాయిన్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరిగిన నోట్లు, కలర్ పడిన నోట్లను సైతం మర్చుకోవచని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ టెస్ట్ మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ పవన్ కుమార్, సిబ్బంది రాంరెడ్డి, అక్బర్, చారీ తదితులున్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ప్రతి ఒక్క మహిళా కూడా అన్ని రంగాలలో ముందుండాలని సీడీపీఓ సరళ, ఏసీడీపీఓ శాంతి అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల, బుడ్డోని తండా, కొండమల్లేపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు, గర్భిణీలకు, బాలింతలకు, పిల్ల తల్లులకు, ఆటల పోటీలను నిర్వహించి అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మహిళలు పురుషులతోపాటు ఎంతోమంది ప్రతి రంగంలో పనిచేస్తున్నారని, ప్రతి మహిళ కూడా మగవారిపైన ఆధారపడకుండా స్త్రీ ఆర్థిక అవసరాల కోసం తనకు తాను సంపాదించుకుంటూ ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తిప్పర్తి రాధా, సర్పంచ్ పంది రుద్రమ్మ, బుచ్చమ్మ, భారతమ్మ, గర్భిణులు బాలింతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

నవతెలంగాణ-దేవరకొండ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్ కుమారుడు డాక్టర్ సుహాస్‌ను చంపుతానని ఫోన్ ద్వారా బెదిరించిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై కేసు నమోదు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారుడు చెరుకు సుధాకర్‌గౌడ్‌ను చంపడానికి 100 వాహనాలు ఏర్పాటు చేసినట్లు సుధాకర్ కుమారుని హాస్పిటల్‌ను కూలగొడతామని ఫోన్ చేసి బెదిరించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చల్లమల్ల అంజయ్యగౌడ్, బోయపల్లి రాములుగౌడ్, బీ.వెంకటేశ్వర యాదవ్, వంగూరు వెంకటయ్యగౌడ్, రాజయ్యయాదవ్, రాచమల్ల నాగయ్య, రాంబాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేడుకలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని ఆక్స్ఫర్డ్ పాఠశాలలో సోమవారం ముందస్తుగా హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు వివిధ రంగులతో హోలీ పండుగను జరుపుకున్నారు. కుల, మత భేదం లేకుండా ఒకరిపై ఒకరు రంగులను చల్లుకొని పండగ వాతావరణాన్ని ఆస్వాదించారు. హోలీ పండుగ గొప్ప తనాన్ని, ఔన్నత్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గడ్డం విశ్వనాథ్, ప్రిన్సిపల్ పెద్ది నరేందర్, ఉపాధ్యాయులు నమ్ముల ఆనంద కుమార్, శమీమున్నిసా బేగం, ఎస్. జ్యోతి, జుబెద, స్వాతి, సుధారాణి, ధనలక్ష్మి, రమాదేవి, ప్రసన్న, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో ప్రతి ఏడాది ఆ గ్రామంలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలను మూడు రోజుల పాటు కనుల పండగ జరుపుకొని రాష్ట్రంలోనే హోలీ పండుగకు ఒకరోజు ముందుగా గత కొన్ని సంవత్సరాల నుండి ఆ గ్రామంలో హోలీ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకుంటారు. సోమవారం అదే ఆనవాయితీగా ఆ గ్రామంలోని యువతి యువకులు ప్రజాప్రతినిధులు అందరూ కలిసి ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిపాటి రాధా రమేష్, ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, ఉప సర్పంచ్ ఆకుల అనిల్, ఆలయ కమిటీ చైర్మెన్ బోయ గాలాయ్య, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం కొట్టాల గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం ఎంపీటీసీ ఊరు పక్క సరిత నగేష్ అంతర్గత సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో అధిక నిధులు మంజూరు కావడంతో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు వేసి అందంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన కొట్టాల గ్రామానికి చెందిన బుర్ర గోపాల్ కు 50వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కుని అందజేశారు.ఈ కార్యక్రమములో కొట్టాల సర్పంచ్ గంట కవిత యాదయ్య,మాజీ సర్పంచ్ గంట కృష్ణ, ఉపసర్పంచ్ బుర్ర షేకర్, లపంగి బిక్షం, బుర్ర లక్ష్మి పతి, వార్డ్ మెంబర్ లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

నవతెలంగాణ-దేవరకొండ



నెహ్రూ యువ కేంద్రం ,దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ,సఖి కేంద్రం ,ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గిరిజన మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మహిళ దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం నల్గొండ మందాకిని, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామల మాట్లాడారు. జనాభాలో సగభాగం ఉన్న స్త్రీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుందని, సమాజంలో స్త్రీలకు రక్షణ లేకపోవడం, శారీరకంగా, మానసికంగా, లైంగిక ,ఆర్థికపరమైన ,హింసలకు గురి కావడం జరుగుతుందన్నారు. మాయమాటలకు నమ్మవద్దని బాలికలకు సూచించారు. తల్లిదండ్రులకు, చదువుకున్న కాలేజీలకు, సమాజానికి ,మంచి పేరు తేవాలని విద్యార్థినీలకు సూచించారు. స్త్రీలకు ఎలాంటి సమస్యలు వచ్చినా సఖి కేంద్రం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వి టి ,సఖి కేంద్రం నాగమణి, కోఆర్డినేటర్ ప్రవీణ్ సింగ్, కొండా నాయక్ ,డాన్స్ మాస్టర్ జగన్ ,చందు ,సునీత ,రేవతి ,భావన, కళాశాల సిబ్బంది ,సఖి సిబ్బంది ,విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు. ఐసిడిఎస్ దేవరకొండ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో సోమవారం మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా మహిళల హక్కులు, సాధికారత పై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు.అనంతరం పాఠశాలలోని ప్రిన్సిపాల్ ,వైస్ ప్రిన్సిపాల్, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి .సావిత్రి ,అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్ .రాధా ,ఎం .విజయలక్ష్మి, డి. చిట్టెమ్మ ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-డిండి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డిండి మండల కేంద్రంలో మొదటి సెంటర్, ఎడ్లగడ్డ తండా సెంటర్, దర్గా వీడి సెంటర్‌లో సోమవారం చిన్నారులకు అన్నప్రసన, అక్షరాభ్యాసం కార్యక్రమం స్థానిక సర్పంచ్ మేకల సాయమ్మకాశన్న, ఎంపీటీసీ రాధికకృష్ణ, సూపర్ వైజర్ కల్లు రేణుకారెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి అన్నారు. డిండి ఎంపీటీసీ 2 ఏటి రాధికకృష్ణ మాట్లాడుతూ అమ్మ ఒడి నుండి అంగన్ వాడి బడి వరకు చిన్నారులను తీసుకవస్తున్న ఘనత వీరికి దక్కుతుందన్నారు. అంగన్వాడీల వలన మంచి అలవాట్లతో బిడ్డ ఎదుగుదలకు తోడుపడుతుందన్నారు. అనంతరం అన్నప్రసనలు, అక్షరాభ్యాసం, కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ పున్న లక్ష్మీ, టీచర్లు బల్ముల చంద్రకళ, బద్దెల సత్యవాణి, వంగాల మంగమ్మ, తుమ్మల లావణ్య, గర్భిణీస్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

నవతెలంగాణ-పెద్దవూర

హోలీ పండుగ సందర్భంగా వైఎస్ఆర్ టీపీ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమావత్ స్వామినాయక్ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

ర్యాగింగ్ చట్ట వ్యతిరేకం, నేరం

- **పేస్ బుక్, వాట్స్ అప్,ట్విట్టర్‌లతో తస్మాత్ జాగ్రత్త**
- **ఎస్పీ కే.అపూర్వరావు**

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



పేస్ బుక్, వాట్స్ అప్,ట్విట్టర్‌ల సామాజిక మధ్యమాలతో విద్యార్థిని విద్యార్థులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, ప్రొఫెషన్ యాక్ట్ ప్రకారం ర్యాగింగ్ చేయడం చట్ట వ్యతిరేకం, నేరం అని జిల్లా ఎస్పీ కే.అపూర్వరావు హెచ్చరించారు. నార్కట్‌పల్లి పట్టణ శివారులో గల కామినేని వైద్య విద్య కళాశాలలో సోమవారం షీ టీం వారి ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్,సోషల్ మీడియా,మాదక ద్రవ్యాలు ,యాంటీ ర్యాగింగ్ చట్టాలపై మెడికల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరగాళ్ల పట్ల సామాజిక మధ్యమలలో జాగ్రత్తల పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రుతి మహంతి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ జిల్లా లో షీ టీమ్స్ బృందాలు బాగా పనిచేస్తున్నాయని, జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ ఇలా ప్రతి చోటా డేగ కళ్లతో పర్యవేక్షణ చేస్తూ లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ మొదలు ప్రతి అంశంలో మహిళలకు ధైర్యాన్ని కల్పిస్తూ నిరంతరం ముందుకు సాగుతూ పని చేస్తున్నాయని అన్నారు. ర్యాగింగ్, గంజాయి, డ్రక్స్ తదితర వాటి వల్ల వచ్చే అనర్థాలు, సమస్యలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో మెసేజ్ లు పెట్టీ ఇబ్బందులకు గురి చేస్తే. ప్రతి ఒక్కరూ నిర్భయంగా పోలీసులకు ఫోన్ చేయవచ్చు, పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వవచ్చు, లేదా డయల్ 100, ద్వారా సమాచారం అందించిన తక్షణమే స్పందించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షి టీమ్ ఇంచార్జి సిఐ రాజశేఖర్ గౌడ్, సిఐ చిట్యాల శివరాం రెడ్డి,నార్కట్ పల్లి యస్. ఐ రామకృష్ణ, మెడికల్ సూపర్డెంట్ డా. కాల్ ఎడ్విన్ లుతర్ పోలీస్ కళా బృందం ఏ హెచ్ టి యు సిబ్బంది మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైదాంతిక వాది గంట నర్సిరెడ్డి..

నర్సిరెడ్డి మరణం సమాజానికి తీరనిలోటు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



సైదాంతిక వాది మాజీ యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు గంట నర్సిరెడ్డి. అకాల మరణం కుటుంబాని కంటే సమాజానికే ఎక్కువ తీరని లోటూ అని ఖమ్మం నల్గొండ వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జువ్వి గూడెం గ్రామంలో సోమవారం జరిగిన అంతక్రియల్లో ఆయన పాల్గొని కామ్రేడ్ గంట నర్సిరెడ్డి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఏర్పాటుచేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ గంట నర్సిరెడ్డి ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులకు ఆర్థికంగా సహకారం అందించి ఉన్నత విద్య పొందే విధంగా కృషి చేశారన్నారు. గంట నర్సిరెడ్డి నిబద్ధతతో సైదాంతిక వాదిగా, యు టి ఎఫ్ బాధ్యునిగా నార్కట్ పల్లి ,నల్లగొండ ,తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో సేవలు అందించారని కొనియాడారు. గంట నర్సిరెడ్డి ఉపాధ్యాయ జీవితం నేటి ఉపాధ్యాయులకు దిక్సూచి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరమండ్ల వెంకటేశం, జిల్లా కోశాధికారి శేఖర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి అరుణ, డివిజన్ బాధ్యులు నర్ర సరళ, పూర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, గాయం నారాయణరెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షాప్‌లకు అద్దె ప్రాతిపదికనటెండర్లు

నవతెలంగాణ - నార్కట్‌పల్లి

రోడ్డు రవాణా సంస్థ నార్కట్ పల్లిబస్ డిపో పరిధిలో గల నార్కట్ పల్లి బస్ స్టేషన్ , చౌటుప్పల్ బస్ స్టేషన్ లలో ఖాళీగా ఉన్న షాప్ లకు అద్దె ప్రాతిపదికనటెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ఆక్షన్ టెండర్స్ ఫార్మ్ సబ్మిట్ చేయుటకు గడువు చివరి తేది. ఈనెల 16.,వరకు మానువల్టెండర్ ఫార్మ్ సబ్మిట్ చేయుటకు గడువు చివరి తేది. ఈనెల 17.వరకు. ఉందని పేర్కొన్నారు. టెండర్ ఫార్మ్ డిపో మేనేజర్, నార్కట్ పల్లి కార్యాలయం లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అమ్మబడును. ఈ టెండర్లలోపాల్గొనుటకు ఆసక్తి గల వారు ఈ క్రింద సూచించబడిన ఆఫీస్ సూపరిండెంట్. నర్సింహా ను సంప్రదించలని సూచించారు. సెల్ నెంబర్ 833205 9500 కాల్ చేయాలని పేర్కొన్నారు.

'కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై హత్యకుట్ర కేసు నమోదు చేయాలి'

నవతెలంగాణ-హాలియా

తెలంగాణ ఉద్యమ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్‌పైన హత్య ప్రయత్న కుట్ర పన్నిన పార్లమెంటు సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిపైన పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రేపాకుల ఆంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. హాలియాలో విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 35 ఏండ్లుగా ప్రజా జీవితంలో ఉన్న నేత చెరుకు సుధాకర్‌ని తెలంగాణ ఉద్యమంలో పీడీ చట్టం కింద కేసులు ఎదుర్కొన్న వ్యక్తిని, నిఖార్సయిన ప్రజా నాయకున్ని చంపేందుకు వెంకటరెడ్డి కుట్ర చేస్తున్నాడని, కుట్రలని తిప్పి కొట్టేందుకు బహుజన సమాజం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధికార ప్రతినిధి బొడ్డు వెంకట్, పిల్లి వెంకట్‌యాదవ్, అన్నెబోయిన కొండల్, జోగు రమేష్ ముదిరాజ్, బెజవాడ అనిల్ గౌడ్, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా పాత్రలు పోషించి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఘనంగా సుపరిపాలన దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా బి మానస, జిల్లా విద్యాశాఖ అధికారిగా జ చరణ్, మండల విద్యాధికారి జగదీష్, ప్రధానోపాధ్యాయులుగా స్పందన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ కుమార్, ఉపాధ్యాయులు మహేశ్వరి, రెహమాన్, వెంకటరెడ్డి, విజయ, శంశునిస, అనుష, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయలుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా తమ స్వీయ అనుభవాలను పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలుగా పసుపులేటి స్పందన, విద్యా శాఖ మంత్రిగా ఆర్. ప్రసాద్,డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గా డి.సంతోష్, ఆర్జేడిగా గగనశ్రీ, కలెక్టర్ గా జి.మహిమా నిరీక్షణ, జాయింట్ కలెక్టర్ గా ఎం.మహేష్ బాబు, డీఈవోగా పి. రంగా, ఎమ్మార్వోగా ఎస్‌కే. సాదియా, ఆర్డీవోగా పి.మహేశ్వరి, డిప్యూటీవోగా ఏ.ముని, ఎంఈఓగా ఏ.త్రిష వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా పాత్రలను పోషించిన విద్యార్థులు ప్రతిభావంతంగా బోధించి అందరిని ఆకట్టుకున్నారు. స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమాలలో పాఠశాల ఎస్.ఎం.సి. చైర్మన్ పసుపులేటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఎండీ.అబ్బాస్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కవిత, నీలియా, అంకిరెడ్డి, ప్రవీణ, సురేష్ కుమార్, మునీశ్వరి, శోభ, పార్వతి, వాజిద్ అలీ, చంద్రకళ, శేఖర్‌రెడ్డి, సోమలింగం, సహదేవ, హిమబిందు, లలిత, హుస్సేన్, సైదా, సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.



కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

కంటివెలుగును ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ భగవాన్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నేతాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ భగవాన్ నాయక్, సర్పంచ్ బాసిరెడ్డి కుమారి వెంకట్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాసిరెడ్డి భార్గవి, కార్యదర్శి రామకృష్ణ, సబ్ ఏఎన్ఎం సెంటర్ కే.సరిత, స్వరూప, సోమయ్య, ఆరోగ్య సిబ్బంది ,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మేగ్యతండాలో రెండవ విడత కంటివెలుగు ప్రారంభం

మండలంలోని మేగ్యాతండ గ్రామ పంచయతీలో సోమవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండవ విడత కంటివేలుగు కార్యక్రమాన్ని గమ సర్పంచ్ కేతావత్ సాజీ భిక్షనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామకృష్ణ, ఉపసర్పంచ్ బుజ్జీ ఏబిఎస్ఎస్ నాగార్జున సాగర్ నియోజక వర్గ అధ్యక్షులు కేతావత్ బిక్ష్యానాయక్, గ్రామ పెద్దలు కిరణ్, బాలు, గోపి, పత్య, శ్రీను, బిక్ష్యా, లక్యా తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నకిరికల్ మాజీ శాసనసభ్యులు వేముల వీరేశం ఇబ్బందులు పడుతున్న పలువురిని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి లింగస్వామి పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జయరుద్దీన్ పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకొని 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న పలువురిని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు విస్తరణలో తన షాపును కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న మండల కాంగ్రెస్ ఓ బి సి సెల్ అధ్యక్షులు జంపాల వెంకన్నకు మానవతా దృక్పథంతో పదిహేను వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాటం వెంకటేశం, బట్టు ఐలేష్‌యాదవ్, ఎద్దులపురి కృష్ణ, కే. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను రద్దు చేయాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలో పంచిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక్కొక్క వార్డుకు 12 నుంచి 20 వరకు డబల్ బెడ్రూమ్ ఇండ్లు రావడం జరిగిందన్నారు. వార్డులో ప్రజలు 150 నుండి 300 వరకు దరఖాస్తులు చేసుకున్నారని, ఎంక్వయిరీ పేరిట అమాయక ప్రజలను తొలగించినారని చెప్పారు. వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో విచారించడంలో అధికారులు విఫలం చెందారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ. సయ్యద్, తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి డీ.లింగానాయక్, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి బంటు రాజేశ్వరి, మండల సమితి సభ్యురాలు ఎస్కే. షమీం, వలపట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిపై జిల్లా ఎస్పీకి చెరుకు సుహాస్ ఫిర్యాదు

నవతెలంగాణ-నల్లగొండ

పీసీసీ ఉపాధ్యక్షుడు తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌ను, ఆయన కుమారుడు డాక్టర్ సుహాస్‌ను ఫోన్‌లో దుర్భాషలాడి, చంపుతానని బెదిరించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు సుహాస్‌తో పాటు మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్ జిల్లా ఎస్పీ అపూర్వరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుహాస్, తండు సైదులుగౌడ్ మాట్లాడుతూ.. నిన్న వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ చేయలేదని, వెంకట్‌రెడ్డిని అరెస్టు చేయలేదని, అందుకే జిల్లా ఎస్పీని కలిసి విన్నవించామన్నారు. తక్షణమే కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అరెస్ట్ చేసి చెరుకు సుధాకర్ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల మల్లేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వడ్డే బోయిన సైదులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మొగుళ్ళ వినోద్ కుమార్, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కారింగు నరేష్ గౌడ్, శ్రీ గౌడ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కొంపెల్లి రామన్న గౌడ్ యూసూఫ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పలు మృతదేహాలకు నివాళులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

త్రిపురారం మండలం వస్త్రం తండా గ్రామపంచాయతీ పరిధిలోని లక్పతి తండా గ్రామానికి చెందిన దనావత్ కోట, నడిమి తండా గ్రామపంచాయతీలోని సత్యం పాహడ్ తండా గ్రామానికి చెందిన ధనావత్ పనామాలి, ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకొని నాగార్జునసాగర్ ఏరియా కమలానెహ్రూ హాస్పిటల్‌కు వెళ్లి వారి పార్థివదేహాలకు నాగార్జునసాగర్ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ , ట్రైకార్ చైర్మన్ రాంచందర్ నాయక్ నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నిడమానూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, త్రిపురారం మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్, రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పెద్ద బోయిన శ్రీనివాస్ యాదవ్, జడ్పిటిసి భారతి భాస్కర్ నాయక్, సర్పంచ్ లావుడి సేవా నాయక్, మాజీ సర్పంచ్ బాలు, మోతిలాల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ హిల్ కాలనీ లోని మొదటి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న ఐ. దానమ్మ సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారము నాడు హైదరాబాద్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు. 1986లో అంగన్వాడీ టీచర్ గా నియమించబడి సుమారు 32 సంవత్సరాలు సేవలందించారు. ఐసిడిఎస్ సిడిపిఓ గంధం పద్మావతి ,సూపర్వైజర్లు గౌస్యవేగం , వెంకాయమ్మ , సరిత, రాజా రాజేశ్వరి, రమాదేవిలు , అంగన్వాడి టీచర్ల సంఘం నాయకులు సైదమ్మ ,మణెమ్మ మరియు స్థానిక అంగన్వాడీ టీచర్లు దానమ్మ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధి హామీ పనులు, నర్సరీల పరిశీలన

నవతెలంగాణ -చండూర్

మండలంలోని ధోని పాముల, నేర్మ ట, కొండాపురం గ్రామాలలో సోమవారం ఉపాధి హామీ పనులను , నర్సరీలను ఎంపీడీవో యాకూబ్ నాయక్ పరిశీలించారు. గ్రామపంచాయతీలు ఈజీఎస్ క్రింద చేపడుతున్న పని ఫిష్ పాండ్ పనికి సుమారుగా 130 మంది కూలీలు పనిచేస్తున్నారని వారికి సకాలంలో కూలీ వేతనాలు వచ్చే విధంగా , ఎక్కువ మొత్తంలో కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉపాధి హామీ కూలీలకు చెప్పారు. ఆయన వెంట ఏపిఓ సీనయ్య, ఈసీ పంచాయతీ సెక్రెటరీ , టిఏ ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం

- ఎస్పీ కె.అపూర్వరావు

నవతెలంగాణ-నల్లగొండ



పోలీస్ గ్రీవెన్స్ డే తో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ కే.అపూర్వరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా జిల్లా వ్యాప్తంగా పిర్యాదుదారులు వివిధ సమస్యల పైన వచ్చిన దాదాపు 40 పిర్యాదులను జిల్లా యస్.పి స్వీకరించి బాధితుల సమస్యల పైన సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగే విధంగా చేయాలి అని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లలో అధికారులు అందుబాటులో ఉండాలి అని సమస్యల పైన త్వరగా చర్యలు తీసుకొని బరోసా కల్పించాలని అన్నారు. బాధితులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని, అప్పుడే ప్రజలలో పోలీస్ అంటే నమ్మకం కల్గుతుంది అని అన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులుగా. ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో పెద్దకాపర్తి గ్రామ సర్పంచ్ మర్రి జలంధర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఆవుల మంజుల జానయ్య యాదవ్. ఎంపీటీసీ ముద్దసాని నీత వెంకటరమణారెడ్డి . ప్రధానోపాధ్యాయులు రామలింగ చారి . ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలిమినేడు గ్రామంలో..

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బీసీ కాలనీ స్వపరిపాలన దినోత్సవం నిర్వహించనైనది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కుమారి దివ్యడిఈఓ గా అజుప, ఎంఈఓ గా మా రూపా, గ్రామ సర్పంచిగా ఆవుల దివ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా ఆవుల భవిత శ్రీ ,గుర్రం నిఖిల్, పీఈటీగా హరిచంద్ర ప్రసాద్ వివిధ విషయ ఉపాధ్యాయులుగా విద్యార్థిని విద్యార్థులు పాత్రలను పోషించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ఎం స్వర్ణలత , బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయురాలు టి మంజుల ను సన్మానించడం జరిగింది. స్వపరి పాలన దినోత్సవం లో పాల్గొని విజేతలైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీధర్ అధ్యక్షతన గ్రామ సర్పంచ్ దేశపోయిన మల్లమ్మ మల్లయ్య, ఎంపీటీసీ స్వరూప నరసింహ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యానాల నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ భారాన్ని ప్రజలపై మోపడం సిగ్గుచేటు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ

నవతెలంగాణ-డిండి

హద్దు అదుపు లేకుండా వంట గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాన్ని మోపడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. సోమవారం సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ కార్యాలయం నుండి స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోనకల్ సర్పంచ్ బొల్లె మంజుల శైలేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎనమల్ల నవీన్, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు హనుమాండ్ల కేశవులు, సిపిఐ తవక్లాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, సహాయ కార్యదర్శి భయ్యా శ్రీను, సిపిఐ ఖానాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి టీ.శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-మాడుగులపల్లి

మాడుగులపల్లి మండల కేంద్రంలో సోమవారం ఊరు చివరలో ఉన్న దేవి రెడ్డి గోపాల్ రెడ్డి బత్తాయి తోటలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సై నరేష్ కుమార్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వివరాలు అలుగుబిల్లి లక్ష్మారెడ్డి, పీ.సైదులు, ఎస్.ప్రకాష్, ఎస్కే. చాంద్ పాషా, టీ. వెంకన్న, నాగరాజులను పట్టుబడి చేసి వారి వద్ద ఉన్న 17,660 నగదు, ఐదు సెల్ ఫోన్లు, నాలుగు మోటర్ సైకిల్‌లను పట్టుబడి చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి వారిపై కేసు నమోదు చేయనైనదని ఎస్సై నరేష్ కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి వారైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన పేకాట జూదం బెట్టింగ్ లాంటి ఆటలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నర్సిరెడ్డికి నివాళులు

నవతెలంగాణ-నల్లగొండ

యూటీఎఫ్ జిల్లా నాయకుడు నికార్సైన కమ్యూనిస్టు గంట నర్సిరెడ్డి శనివారం హైదరాబాదులో మృతి చెందాడు. ఆయన పార్థివ దేహానికి సోమవారం జిల్లా కేంద్రంలోని క్రాంతి నగర్ కాలనీ వారి స్వగృహంలో ఉంచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అర్హులకే ఇండ్లను కేటాయించాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకే కేటాయించాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ నల్లగొండ జిల్లా కమిటీ జిల్లా మైనార్టీ కన్వీనర్ చాంద్ భాష ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పూదరి సైదులు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపిక ప్రక్రియలో జరిగిన తప్పిదాలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు కోడి భీం ప్రసాద్, కత్తుల కాన్సిరాం, ఒంటెపాక యాదగిరి, శ్రీనివాస్, లింగస్వామి, తాహెరా, జాబి, హాజూమ్, రాధా, ఇస్రాత్, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

కొండమల్లేపల్లి మండలం ధోనియాల గ్రామానికి చెందిన ఎలిమినేటి నరసింహ అనారోగ్యం కారణంగా గత పది రోజుల క్రితం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న తన చిన్ననాటి పదవ తరగతి, ఇంటర్మీడియట్ స్నేహితులు కలిసి తమ వంతు సహాయంగా సోమవారం స్నేహితుని నివాసం నందు భార్య సంధ్య కు 43 వేల రూపాయల నగదును అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్నేహితుడు నరసింహ మృతి ఎంతో బాధాకరమని తన జ్ఞాపకాలను మరవలేని అని అన్నారు ఈ సందర్భంగాదేవరోని తండా సర్పంచ్ ఇస్లావత్ రాకేష్ 3000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో మహేందర్రెడ్డి, రాందాస్ ,తోటి స్నేహితులు పాల్గొన్నారు .

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మాడుగులపల్లి

మండలం పరిధిలోని పాములపహాడ్ గ్రామంలో సోమవారం విషాదం చోటు చేసుకుంది. పాములపాడు గ్రామంలో రైస్ మిల్లును నడుపుతున్న గుణగంటి శ్రీను అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు.ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ రాడ్డుకు తాడుతో ఉరి వేసుకొని బలవన్మరణంకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన గుణగంటి శ్రీను ఉరి వేసుకొని చనిపోయినట్లు సమాచారం.అతను చనిపోవడానికి ముందు తన ఆవేదనను ఆడియో రూపంలో రికార్డ్ చేశాడు. ఆ రికార్డులో ఇలా ఉంది..ఫ్రెండ్స్ మా అమ్మ, నాన్న మా అక్క, తమ్ముడు నన్ను బతకనివ్వరు. ఇక నేను బతకను నా కష్టం డబ్బులతో రైస్ మిల్ కొనుక్కొని కష్టపడి నిలబెట్టుకున్నాను నా భార్య పిల్లలకు న్యాయం జరిగేలా చూడాలని అందులో వేడుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములపల్లి ఎస్ఐ ఎన్ శ్రీను తెలిపారు.